మే - 2019

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| తిమోతి | కొడవటికంటి | 03 |
| నూతన జీవనము | | 06 |
| | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 07 |
| క్రైస్తవజీవిత దృక్కోణం | | 09 |
| | పి.రంజిత్ కుమార్ | |
| రూతు | యు.అనిత, సిరివెల్ల, కర్నూలుజిల్లా | 10 |
| మదర్ తెరీసా | | 12 |
| | బ్రదర్ కె. సామ్రాట్ | |
| సాక్ష్యము | శ్రీమతి సుగుణమ్మ | 14 |
| ఎంతవరకు? | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 16 |
| దేవుడు-సిరి | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 17 |
| బైబిలు కథలు- | దావీదు | 18 |
| | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | |
| క్రొత్త కోణాలు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 20 |
| అక్షరయజ్ఞం - | బైబిల్ క్విజ్ | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |



**ప్రధాన సంపాదకులు :**

**రెవ.డా॥ కె. జోసఫ్**

**సర్క్యులేషన్ :**

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 250/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28, క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9704255416


**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Joseph**

A/c No.: **10957380353**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP

EVANGELISM
- Church Planting
- Evangelistic Crusades
- Pastor's Seminars
- Youth Ministry
- T.V.Ministry
- Magazine Ministry
- Audio Ministry
- Jail & Prison Ministry
- IERF International Ministry
- Hanna Women Ministries

RELIEF
- Orphanage
- Child Development Centers
- Education (U.C.L.I. Schools)
- Widows & Lepers Care
- Medical Assistance
- Help in Natural Calamity
- Flood Relief
- Mobile Medical Ministry
- Children Care Ministry

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

'పరిశుద్ధత' మాస పత్రికను ఆదరిస్తున్న మీ అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సంవత్సరం వేసవి ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయి. భూమి అగ్నిగోళంలా మారినట్లు అనిపిస్తుంది కదా! ప్రతి సంవత్సరం ఎండ తీవ్రత అంతకంతకు పెరుగుతూనే ఉంది. ఈ వేడి తాపము తట్టుకోలేక అనేకమంది ఇళ్ళల్లో నుండి బయటకు రాలేక తన పనులు వాయిదా వేసుకుంటున్నారు. ఈ ఎండ వేడిమిని తప్పించుకోడానికి మనం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాము. అయితే రాబోవు అగ్ని ప్రళయమును తప్పించుకోడానికి మన దగ్గరున్న మార్గాలు ఏంటి? ఈ భూమి అగ్ని ప్రళయము కోసం సిద్ధం చేసి ఉందని బైబిలు చెపుతుంది. "ఇప్పడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినము వరకు అగ్ని కొరకు నిలువ చేయ బడినవై, అదే వాక్యము వలన భద్రము చేయబడియున్నవి" 2పేతురు 3:7. మరి మనం ఈ అగ్ని వలన నాశనము కాకుండా ఉండటానికి మనకున్న మార్గం ఏమిటి? ఈ భూమి మీద కేవలం వేసవి కాలంలో ఉండే ఎండ వేడిమికి తట్టుకోలేని వాళ్ళు నరకంలో అగ్నిగుండంలో అనుభవించబోయే ఆ నరకప్రాయమైన వేడి నుండి ఎలా తప్పించు కుంటారు. అక్కడ అగ్ని ఆరదు పురుగు చావదు. దేవుడు మనకు దయచేసిన మన ఆత్మను నరకము నుండి కాపాడాలంటే ఈ భూమి మీద మనం దేవుని చిత్తాన్ని నెరవేర్చాల్సి ఉంటుంది. ఈ భూమి మీద దేవుడు మనకు ఇచ్చిన పనిని సంపూర్తిగా నెరవేర్చాలి. ఈ దేహము దేవుని వలన మనకు అనుగ్రహించబడింది. కాబట్టి ఈ దేహముతో మనం దేవునిని మహిమపరచాలి. "క్రిందనున్న పాతాళమును తప్పించుకొనవలెనని బుద్ధిమంతుడు పరమునకు పోవు జీవమార్గమున నడుచుకొనును" సామెతలు 15:24.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరు చున్నాను. మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచి నట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–ఎడిటర్

**K. Joseph, SBI Main Branch, Ongole**
**A/c No. 10957380353**

| సీరియల్ నంబరు | |
|---|---|

సీరియల్

# తిమోతి

15

## (అపొస్తలుడు మూడవభాగం)

– కొడవటికంటి

"లుస్త్ర, తిమోతి నాకు కుమారునివంటి వాడు" అని లేచి నిలుచున్నాడు. యెరూషలేము పట్టణమంతా నిర్మానుష్యమైనట్లుగా అనిపించింది. ఇక రోజులు గడిచేకొద్దీ ఎన్ని వార్తలు వినాలో అనుకుంటూ హేలేదుతో తిమోతికి బస చూపించమని పట్టణం వైపుగా బయలుదేరాడు. పౌలు మెట్లు దిగుతుంటే వెనుకవైపు నిదానించి చూస్తున్నాడు హేలేదు. మరలా వెనుకవైపు కిటికీ తెరచి బయట రహదారి వైపు చాలాసేపు చూసి నిట్టూర్చాడు. తనవైపే చూస్తున్న తిమోతిని చూచి చిన్నగా నవ్వి దగ్గరగా వస్తూ "రా నాయనా, స్నానం చేద్దువుగాని" అని అంటూ ప్రక్కన ఉన్న గదివైపుకు దారితీశాడు. "అయ్యా, పౌలుగారు ఎక్కడికి వెళ్తున్నారు? ఎప్పుడు వస్తారు?" అని అడిగాడు తిమోతి. "అందుకే నేను అలా కిటికీ నుండి చూశాను. ఆయన దక్షిణం వైపుగా వెళ్తున్నారు. ఎందుకో అర్థంకాలేదు" అని గొణుక్కుంటూ గదిలోకి వెళ్ళాడు హేలెదు. తిమోతి స్నానానికి వెళ్ళాడు.

యెరూషలేము వీధిలో అడుగుపెట్టిన పౌలు కొంచెంసేపు నిలుచుండిపోయాడు. రహదారి తప్పితే కట్టడాలు, ప్రజలందరూ మారిపోయినట్లుగా కనిపిస్తున్నారు. జనాభా పెరిగినట్లు కనబడుతుంది. తలా ఒక ప్రక్క పరుగెడుతున్నట్లు కనిపిస్తున్నారు. వీరందరికీ ఏమైంది అనుకున్నాడు మనసులో. ఎటు వెళ్ళాలి? బర్నబా లేడు, మార్కు లేడు, కేఫా లేడు. గమలియేలు గారింటివైపు వెళ్దామా అనుకొని అటువైపు తిరిగాడు కాని అక్కడ మాత్రం ఎవరున్నారు? రీఫత్ ఇంటికి వెళ్ళాడు. తలుపు బయట తాళం వేసి ఉంది. ప్రక్క ఇంటి వారిని అడిగాడు. లోపల నుండి యూదురాలు బయటకు వచ్చింది. ఆమె కొంచెం ముఖం చిట్లించి "ఎవరూ? ఆ క్రైస్తవుడా?" అంది. పౌలు మొదట్లో కొంచెం ఆశ్చర్యపోయినా తాను రీఫత్‌ను ఆఖరుసారి కలుసుకున్నప్పుడు అతనితో జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది. అనుమానంగా, మౌనంగా తలూపుతూ ఆమె పౌలువైపు అదో విధంగా చూచి "ఆ కుటుంబమంతా ఇక్కడ నుండి వెళ్ళిపోయి చాలా కాలమైంది" అని అంది. "ఎక్కడికి వెళ్ళారో తెలుసా?" అని నిమ్మళంగా అడిగాడు. ఏమో, అతనే కాదు, ఈ పట్టణంలో ఆ మార్గంలో నడిచేవారందరూ దాదాపు పట్టణం వదలి ఎటో వెళ్తూనే ఉన్నారు" అని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది. పౌలు అలాగే నిలబడిపోయాడు. ఏం చెయ్యాలి? ముందు ఇక్కడ యెరూషలేములో పరిస్థితి అంతా తెలుసుకొని తర్వాత యాకోబుని చూడాలని అనుకుంటే ఒక్కరైనా తెలిసిన వారు కనిపించటం లేదు అనుకున్నాడు. ఇల్లు చేరే టప్పటికి బాగా ప్రొద్దుపోయింది. హేలేదు, తిమోతి పౌలును చూచి సంతోషంగా లేచారు. హేలేదు ఇంక తనను అణచుకోలేక "హమ్మయ్య వచ్చారా" అని అన్నప్పుడు పౌలు హేలేదు వైపు చూస్తూ "ఏమిటి?" అని అడిగాడు. "మీరు తిరిగి వచ్చే వరకు హేలేదు చాలా కలత చెందాడు" అని చెప్పాడు తిమోతి. పౌలు మెల్లగా హేలేదు దగ్గరకి వచ్చి మంచం మీద కూర్చుని హేలేదును కూడా కూర్చోమని చెయ్యిపట్టుకొని ప్రక్కన కూర్చుండబెట్టుకున్నాడు. హేలేదు పౌలు ప్రక్కనే కూర్చుంటూ "నీరో, చక్రవర్తి అయినప్పటి నుండి పాలస్తీనా అంతా రోమా అధిపతి చేతిలోనికి వచ్చింది. అందువల్ల ఉగ్రవాదుల బెడద ఎక్కువైంది. రోమాసామ్రాజ్య పతనానికై పోరాడుచున్న వారి సంఖ్య ఎక్కువై పట్టపగలు హత్యలు, దోపిడీలు ఎక్కువయ్యాయి. బయట బజారులోకి వెళ్ళిన వారు తిరిగి ఇంటికి వస్తారనే నమ్మకం లేకుండా పోయింది" అన్నాడు. "అయినా తిమోతిని తీసికొని యాకోబుని చూసొద్దామని వచ్చాను" అని తిమోతి వైపు

చూశాడు సిద్ధపడమన్నట్లుగా. హేలేదు వైపు చూసి భోజనానికి ఇక్కడికే వస్తామని చెప్పి తిమోతితో కలిసి బయలుదేరాడు. పౌలు చాలా వడిగా నడుస్తున్నాడు. తిమోతి ఆయనను చూస్తూ నడుస్తున్నాడు. కొంచెం ముందుకు నడిచి "యాకోబుకి ఇక్కడ స్వంత ఇల్లు ఉందా?" అని అడిగాడు. "లేదు, జబదయ యోహానుకు ఉంది. మొదట్లో మనం బసచేసిన ఆ గొప్ప మేడగదిని శిష్యులు బసగా ఉపయోగించారు. ఇప్పుడు చాలా వరకు శిష్యులు ఈ పట్టణం వదలినందున స్థలం మార్చారు" అని చెప్పాడు పౌలు. చాల సందులు తిరిగిన తరువాత ఒక చిన్న ద్వారబంధం యొద్ద నిలిచి చిన్నగా తలుపు మీద శబ్దం చేసి నిలుచున్నాడు. కొంచెం సేపటికి శబ్దం లేకుండా తలుపు తెరుచుకుంది. ఒక యౌవన స్త్రీ తలుపు వద్ద నిలిచియున్న పౌలుని చూసి ఆహ్వానిస్తున్నట్లుగా తలూపి ప్రక్కకు జరిగింది. పౌలు, తిమోతి లోపలికి వెళ్లిన తర్వాత తలుపు మూసి గడియపెట్టింది. పౌలు లోపల ఒక గది వద్ద ఆగి చూశాడు. లోపల్నుండి సంతోషకరమైన స్వరంతో "సహోదరుడా పౌలు" అంటూ యాకోబు వచ్చి పౌలును కౌగలించుకొని లోపలికి తీసుకెళ్ళి ఆసనము మీద కూర్చుండబెట్టి ప్రక్కన కూర్చుని తిమోతి వైపు ప్రశ్నార్ధకంగా చూశాడు. "లుస్త్ర తిమోతి, నా ప్రియమైన వాడు" అన్నాడు పౌలు. పస్కా పండుగకేగా అన్నాడు యాకోబు నవ్వుతూ. అంతేకాదు కెంక్రేయలో మొక్కుబడి చేశాను. ఇక్కడ సంస్కారము తీసికొనవలెనని తొందరపడుతూ వచ్చాను అన్నాడు పౌలు. తర్వాత పౌలు దాదాపు ఒక గంటసేపు యూరపులో జరిగిన సేవను గురించి వివరించాడు. ముగింపులో ''ఎల్లుండి పస్కా అయిన తర్వాత అంతియొకయ వెళ్ళిపోతాను. అక్కడ నుండి తార్సు, లుస్త్ర అబ్బాయి మొదటిసారి ఇల్లు వదలి చాలాకాలం గడపటం ఇదే మొదలు'' అంటూ తిమోతిని చూపించాడు. యాకోబు లేచి తిమోతి దగ్గరకు వచ్చి కౌగలించు కున్నాడు. తిమోతి శరీరం జలదరించింది. ప్రభువు యొక్క స్వంత రక్తమాంసాలు కలిగిన ఆయన సోదరుడు కదా అన్న భావన. ఈసారి సిరియా ఓడరేవులో వీడ్కోలు పలుకుటకు ఎవరూ లేరు. సాయంకాలం ఓడ బయలు దేరుతుందని తెలుసుకొని కేవు చెల్లించి పట్టణం చూడటానికి బయలుదేరారు. మొదట కొర్నేలి ఇంటికి వెళ్ళారు. అక్కడ సంఘమును చూసిన తర్వాత అక్కడ మహా హేరోదు కట్టించిన గొప్ప కట్టడాలు చూసిన తర్వాత ఒక పెద్ద భవంతి దగ్గర ఆగి "ఇక్కడ పిలాతు నివసించేవాడు" అని చెప్పాడు పౌలు. తిమోతి చాలాసేపు ఆలోచించి "ఆ భవంతిలో అధిపతిగా నియమితుడైన వ్యక్తి జీవితం ముగింపు అంత ఘోరంగా ఉంటుందని ఎవరైనా ఊహించగలరా?" అని ప్రశ్నించాడు తిమోతి. పౌలు మౌనంగా ముందుకు కదిలాడు. "ఇప్పుడు ఇక్కడ ఎవరు నివసిస్తున్నారు" అడిగాడు తిమోతి. "మొన్నటిదాకా మూమానస్ అనే అధిపతి ఉండేవాడు. కాని ఈ సంవత్సరం ఫెలెక్స్ అనే అధిపతిని నియమించారు" చెప్పాడు పౌలు. అప్పటికే చాలాదూరం నడిచారు. దాదాపు సముద్ర ప్రాంతం వచ్చారు. పౌలు అక్కడున్న ఇసుక దిన్నెమీద కూర్చున్నాడు. తిమోతి కూడ పౌలు ప్రక్కనే కూర్చున్నాడు విశ్రాంతిగా. "ఫెలెక్స్ కూడా పిలాతు వంటివాడేనా?" అడిగాడు తిమోతి. పౌలు చిన్నగా నవ్వి "రోమీయులు యూదయ మీద నియ మించిన అధిపతులందరూ దుర్మార్గులే. ఆ దుర్మార్గతలో హెచ్చుతగ్గులు ఉన్నాయి. అలా పోల్చి చూస్తే పిలాతే చాలావరకు నయమనిపిస్తుంది. ఫెలెక్స్ ఏమంత సంతోషకరమైన వ్యక్తి కాదు. అతని గురించి ఇరవై సంవత్సరాలకు పూర్వమే ఇల్లూరియ ప్రాంతంలో సేవ చేసేటప్పుడే విన్నాను. రోమ్‌లో సైనిక శిక్షణ పొందే టప్పుడే అధిపతిలాగ ప్రవర్తించే వాడని, ఇప్పుడు అధిపతి కదా ఇక రాజులాగా ప్రవర్తించవచ్చు. అతని పుట్టుక కూడా చాలా ఏహ్యమైనదే. ఇద్దరు భర్తలతో కాపురం చేసి మూడవ వానితో కాపురం చేస్తున్న తల్లి కుమారుడు. క్లౌదియ చక్రవర్తి వలన బానిసత్వం నుండి విడుదల

పొందిన పెల్లాస్ యొక్క తమ్ముడైనందువల్ల అతని ప్రాబల్యంతో చాలా డబ్బు వెచ్చించి ఈ అధిపతి స్థానం పొందాడు'' అని చెప్పాడు పౌలు. ''అంత డబ్బు బానిసలైన వీరికెక్కడిది" అడిగాడు తిమోతి. "క్లౌదియ చక్రవర్తి హత్యగావింపబడినప్పుడు సంక్రమించిందని వదంతి. అయినా అందులో నిజం లేకపోలేదు. ఈ అధిపతి స్థానం అధిష్టించిన మొదటి బానిస ఇతనే అయివుండవచ్చు" అన్నాడు పౌలు. తిమోతి జాగ్రత్తగా వింటూ పౌలు వైపు చూచి "ఇంత హీనమైన చరిత్ర కలిగిన వారు దేశాన్ని ఏలితే దేవుడు ఎలా చూస్తుంటాడు" అన్నాడు. "దుర్మార్గుని వలననే దౌష్ట్యం పుడుతుంది. జరగాల్సిన నీచ కార్యాలకు దేవుడు నీచులనే ఏర్పాటు చేసుకుంటాడు. తన సొంత కుమారులను చంప గలిగిన రాజ్యకాంక్షాపరుడైన మహా హేరోదును ప్రవక్తయైన యిర్మీయా ద్వారా పలుకబడిన ప్రవచనం. రామాలో అంగలార్పు అనునది నెరవేరుటకు బేత్లెహేము దాని సకల ప్రాంతాలలోను రెండు సంవత్సరాలు మొదలుకొని తక్కువ వయస్సుగల మగపిల్లల నందరిని వధించాడు. ఫెలిక్స్ మొదటి భార్య ఎవరో తెలియదు కాని మొత్తానికి ఆమె ఒక రాజకుమార్తె. రెండవ భార్య ఈజిప్టు రాణి క్లియోపాత్ర. ఆంటనీ మనుమరాలు. మూడవ భార్య యూదుడైన మొదటి అగ్రిప్ప హేరోదు చెల్లెలు ద్రుసిల్ల. ఈమెను ఈ మధ్యనే తను యూదయకు అధిపతియైన తర్వాత కలిసికున్నాడు. ఆమె ఎమెసా రాజైన అజజస్ భార్య. ఆమెను ఇతను తీసుకొని వచ్చాడు. ఆమె వయస్సు ఇప్పుడు పంతొమ్మిది సంవత్సరాలే" అంటూ లేచి నిలబడి "ఇంక వెళ్దామా" అన్నాడు పౌలు. తిమోతి వెళ్దామన్నట్లు తలూపి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఓడ రేపు ఉదయం బయలుదేరితే బాగుండు, ప్రయాణంలో అనేక ఓడ రేవులు చూడవచ్చు అనుకున్నాడు. సిసారియాలో సాయంకాలం బయలు దేరకుంటే తిమోతిలో ఏదో క్రొత్త భావన మెదిలినట్లయింది. నిజానికి ఈ ప్రయాణం అంతియొకయ వరకే అయినా తాను ఇప్పుడు తన ఊరైన లుస్త్రకు వెళ్తున్నట్లు అనిపించింది. లోయి అవ్వ, అమ్మ గుర్తుకొచ్చారు. ఎంత కాలం, ఎంత దీర్ఘమైన ఎడబాటు. బయలు దేరేటప్పుడు ఇంతదేశం తిరుగుతామని అనుకోలేదు. యెరూషలేములోని సంఘాన్ని అందరూ తల్లి సంఘమంటారు. తనకు మాత్రం ఎందుకనో అది పరాయి సంఘంలాగా, అంతియొకయే తల్లి సంఘంలాగా అనిపి స్తుంది. అంతియొకయ యెరూషలేము కంటె పెద్ద పట్నం, అందమైనది, సంపన్నమైనదని విన్నాడు. సముద్ర ప్రయాణమైన తర్వాత ఓరంటస్ నదీ ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా ఉంది తానూహించినట్లుగానే అంతియొకయ సంఘం ఎంతో ఆహ్లాదం కలిగించింది. ప్రపంచంలోని అన్ని భాషలు మాట్లాడేవారు నివశించే ప్రాంతమిది. అన్ని జాతుల, సంస్కృతుల నిలయమైనది. తాను ఎక్కడికి వెళ్ళినా తన సొంత పట్టణంవలె గ్రీకు భాష అందరికీ తెలియును. ఒకరోజు గుఱ్ఱపు పందాలు జరిగే మైదానం వరకు వెళ్ళి వచ్చాడు. ఒకరోజు నాటకశాలకు వెళ్ళి వచ్చాడు. పౌలు ఎక్కువ సమయం సంఘ పెద్దలతోను, పరిచారకులతోను మిగిలిన ప్రవక్తలకు తన పర్యటన పూర్వాపరాలు తెలుపుతూ తనను మాత్రం స్వతంత్రునిగా అంతియొకయ సంఘంలోని సభ్యులతో విడివిడిగా కుటుంబ పరిచయాలు జరిగేటట్లుగా ఏర్పాటు చేశాడు **(సశేషం)**

**మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు**

| | |
|---|---|
| **Name** | **: K. Joseph** |
| **A/c Number** | **: 10957380353** |
| **Bank** | **: State Bank of India Main Branch, Ongole** |
| **IFSC Code** | **: SBIN0000890** |

మీ చందాను నెట్‌బ్యాంకింగ్ ద్వారానే పంపాలి. చందా పంపిన తర్వాత 9440217726 కి ఫోన్ చేసి చెప్పాలి లేదా మీరు కట్టిన మొత్తము, ట్రాన్‌సాక్షన్ నంబరు మెసేజ్ చెయ్యాలి.

# నూతన జీవనము

విశ్వాసులయిన మనకందరికి విశ్వాసము కలిగి వుండాలని శ్రమలను అనగా సైతాను శోధనలు జయించి దేవునికి ఇష్టులుగా జీవించాలని వుంటది. ఈ విధంగా వుండాలంటే మనము విశ్వాసము కలిగి వున్నామనుకుంటే సరిపోదు విశ్వాసములో ఎదుగుతూవుండాలి. అయితే మనం లోకరీతిగా ఎదగటానికి ఇష్టపడతాము గాని దేవుని కిష్టులుగా ఎదగాలని గ్రహించము.


అసలు ఏదైన ఎవరి దగ్గర నుంచి అయినను మనము పొందాలని అనుకుంటే మనము వారికి ఇష్టులుగా ఉండాలి. మనము వారికి ఇష్టులుగా వుంటే వారు సంతోషముతో మనము అనుకున్న దానికంటే ఎక్కువ ఇస్తారు. " **ఆయన మనయందు ఆనందించిన యెడల** " ఆ దేశములో చేర్చి దాని మనకిచ్చును అది పాలు తేనెలు ప్రవహించు దేశము (సంఖ్యా 14:8). దేవునికి ఇష్టులుగా ఉండాలంటే ముఖ్యమైనది. "విశ్వాసము" **విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై వుండుట అసాధ్యము** (హెబ్రీ 11:6). నీవు విశ్వాసివై యుండుట అందరికి కనబడాలి. విశ్వాసము ఎట్లా కనబడుద్ది అనుకోవచ్చు, విశ్వాసమనేది విధేయతలో కనబడుతుంది. ఉదాహరణకు దశమభాగము దేవునికి ఇచ్చినట్లయితే ఆకాశవాకిళ్ళు విప్పి ఇస్తానన్నాడు. ఆ మాటయందు మనకు విశ్వాసము ఉంటే 10వభాగము దేవునికి ఖచ్చితంగా ఇస్తాము.

అబ్రాహాము దేవునికి అన్ని విషయములలో విధేయుడుగా వున్నాడు. కనుకనే విశ్వాసులకు తండ్రియును పేరుపొందాడు. ఆదికాండము 12వ అధ్యాయములో నీ తండ్రి ఇంటిని విడిచిపెట్టి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళమనినప్పుడు మారు మాట్లాడకుండా బయలుదేరి వెళ్ళాడు. 22 వ అధ్యాయములో " నీకు ఒక్కగానొక్క కుమారుడును నీవు ప్రేమించు ఇస్సాకును నాకు దహనబలిగా అర్పించమని అన్నప్పుడు మారు మాట్లాడకుండా బలి యివ్వటానికి కుమారుని తీసికుని వెళ్ళాడు. అందువలన దేవుడు ఎంతో సంతోషించి "నీకు ఒక్కడైన నీ కుమారుని వెనుతీయక నాకు బలి ఇచ్చుటకు సిద్ధపడినావు కాబట్టి ఇందును బట్టి నిన్ను ఆశీర్వదిస్తున్నాను" అని చెప్పాడు.

ఉదాహరణకు చెప్పాలంటే హెబ్రీ 11వ అధ్యాయ ములో అనేకమందిని చూస్తున్నాము. మోషే పెద్దవాడైనప్పుడు ఐగుప్తు ధనము కంటె క్రీస్తును గూర్చిన నింద గొప్ప భాగ్యమని ఎంచుకొని అల్పకాల పాప సుఖముల కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి ఫరో కుమార్తె యొక్క కుమారుడనని అనిపించు కొనుటకు ఒప్పుకొనలేదు. అయితే ఇప్పుడు మనలో అనేకులు విశ్వాసులుగా ముద్రలేయించుకొని భూసంబంధమైన లాభముకొరకు, అనగా ఉద్యోగాలకొరకు, రాయితీల కొరకు, ఆస్తుల కొరకు క్రీస్తు వారముకామని వారి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. క్రీస్తువారము కామని రిజిస్టరు చేసుకుంటున్నారు. క్రీస్తును మేము ఎరుగమని చెప్పుకుంటున్నారు. మళ్ళీ విశ్వాసులే? ఎంత సిగ్గుకరమైన విషయమో ఆలోచించండి కనుక విశ్వాసులమైతే క్రీస్తుకు లోబడుదాము ఆశీర్వాదము పొందుకుందాము.

**(ఇంకా ఉంది)**

**ఇంటర్నెట్‌లో 'పరిశుద్ధత' మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి**
Read Our Internet Edition @
**www.holinessmagazine.com**



రెవ.డా॥ కె.జోసఫ్



# శాశ్వత రక్షణ

పరలోక రాజ్యము – ఇదే వెయ్యేండ్లు పరిపాలన లేక క్రీస్తు రాజ్యము దీనిలో ప్రవేశించటానికి రక్షించబడిన విశ్వాసులకు క్రియలు కావాలి. రక్షించబడిన విశ్వాసులు మాత్రమే ఇందులో ప్రవేశిస్తారు. అయితే సత్క్రియలు కలిగివుండాలి. తిరిగి జన్మించిన తరువాత జీవించే క్రైస్తవ జీవిత సరళిని బట్టి లేక వారి క్రియలను బట్టి అనుకూల, ప్రతికూల ఫలాలు విశ్వాసి ఇక్కడ పొందుతాడు. 2కొరింథీ 5:10లో వ్రాయబడిన "తాము జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడు పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలెను". ఇది వేయ్యేండ్లు పరిపాలనలోనే జరుగుతుంది. (రోమా 14:10, మత్తయి 16:27, 1పేతురు 1:17 ప్రకటన 11:18). వెయ్యేండ్ల పరిపాలన తరువాత వెయ్యేండ్ల పరిపాలనలో శిక్ష పొందినవారు ఫలములు పొందినవారు అందరూ కలసి నిత్యజీవములో ప్రవేశించి సదాకాలము క్రీస్తుతో ఉంటారు. "నిత్యజీవము– పరలోక రాజ్యము" ఈ రెంటిని గురించి బైబిలులో చాలాసార్లు వివరించబడినప్పటికి ఒకేసారి రెంటిని గూర్చి వివరించబడలేదు. ఒకసారి ఒకదానిని ఇంకొకసారి ఇంకొక దానిని గూర్చి వివరించబడింది. ఈ రెండు సత్యాలను వాటివాటి సందర్భాలను బట్టి బోధించాలి. విశ్వాసుల పునరుత్థానములో, విశ్వాసుల ఆత్మలు మొదట క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలనలో ఆ తరువాత నిత్యజీవములో ప్రవేశిస్తాయి. సాధారణంగా ఇక్కడ తప్పుగా బోధ జరుగుతుంది. వెయ్యేండ్ల పరిపాలనను నిత్యజీవమును ఒకదానినొకటి కలిపి బోధిస్తారు. వేయ్యేండ్ల పరిపాలనకు ఒక అంతము వున్నది. నిత్యజీవము నకు అంతము లేదు. వెయ్యండ్ల పరిపాలనలో జరిగిన సంగతులు నిత్యజీవములో జరుగుతాయని బోధిస్తారు. అందువలననే పొరపాటు జరుగుతుంది. రక్షించబడినవారు అనగా నిత్యజీవముకు వారసులైన వారు ఈ వెయ్యేండ్ల పరిపాలనలోనే వారి క్రైస్తవ జీవిత నడకలో చేసిన తప్పులను బట్టి శిక్ష అనుభవిస్తారు. ఎందుకంటే ఇది ఉచితంకాదు (దానము కాదు) క్రియల వలన పొందేది. నిత్యజీవమునకు వారసులైన వారందరు ఈ వెయ్యేండ్ల పరిపాలనలో వారివారి క్రియలను బట్టి ఫలములు పొందుతారు. (2కొరింథీ 5:10) వారు జీవించిన విలువలను బట్టి మంచి ఫలములు, కిరీటాలు పొందుతారు. వారు సరైన జీవితము జీవించి ఉండక పోతే దానికి తగినట్లుగా శిక్షలు పొందుతారు. ఆ తరువాత శిక్షపొందిన వారు, మంచి బహుమతులు పొందిన వారు అందరు నిత్యజీవితంలో ప్రవేశిస్తారు. ఎందుకంటే వీరందరు నిత్యజీవమునకు అర్హులే, తిరిగి జన్మించినవారే, కుమారులే. తప్పులను బట్టి శిక్ష అనుభవిస్తారే గాని స్వాస్థ్యమును పోగొట్టుకొనరు (కీర్తనలు 89:30–34). దేవుడు తన బిడ్డలను శిక్షిస్తాడే గాని నశింపజేయడు (సామెతలు. 19:18). మరొకసారి గుర్తుంచుకొండి వేయేండ్ల పరిపాలన వేరు , నిత్యజీవితము వేరు. యోహాను.3:16 లోయేసు నిత్యజీవము ఇవ్వటానికి వచ్చాడు అని వ్రాయబడింది కాని పరలోక రాజ్యము ఇవ్వటానికి కాదు. తర్జుమాలో కూడా ఈ విషయంలో కొంత పొరపాటు జరిగింది. యూదులు మెస్సయ్య రాజ్యము కొరకు అనగా క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలన కొరకు ఎదురు చూశారే కాని నిత్యజీవము కొరకు కాదు. హెబ్రీ భాషలో నిత్యజీవము అనే పదము లేదు. యుగము అనే పదమునే నిత్యజీవముగా వారు వాడేవారు. మత్తయి 19:16 లో ఒకడు నిత్యజీవము పొందుటకు నేను ఏ మంచి కార్యము

చేయవలెనని యేసుని అడిగాడు. నిత్యజీవమునకు మంచి కార్యము అనగా క్రియలు అవసరం లేదు. అది ఉచితము. అంటే తర్జుమాలో జరిగిన పొరబాటు పరలోకరాజ్యమునకు బదులుగా నిత్యజీవము అని తర్జుమా చేయబడినది. తరువాత భాగాలలో ఈ విషయం వివరించ బడింది. కనుక క్రీస్తు బలి అర్పణము ద్వారా మనకు లభించిన నిత్యజీవమును క్రియల ద్వారా మనము సంపాదించుకోవాలి అని చెప్పడం తప్పు. నిత్యజీవము కొరకైన కార్యములన్నీ క్రీస్తే మన పక్షముగా చేసి ముగించాడు. మనము పొందవలసిన శిక్ష ఆయనే పొందాడు కనుక నిత్యజీవము కొరకు మనము క్రియలు చేయనవసరం లేదు. దేవుని కృపలో ఉచితముగా (దానముగా) పొందే నిత్యజీవము విశ్వసించిన వారందరికి ఒకే విధముగా ప్రాప్తిస్తుంది. "ప్రతి ఫలము" అనగా వారివారి క్రియలను బట్టి వారివారి అర్హతలను బట్టి వచ్చే జీతము. దాని ఫలము శిక్ష గాని మేలు గాని అవొచ్చును. వానివాని క్రియల చొప్పున ప్రతివానికి ఇచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా దగ్గర ఉన్నది. ఇది వెయ్యేండ్ల పరిపాలనలో జరిగే కార్యము. జీతము అంటే చేసిన పనికి పొందే ప్రతిఫలం. కాని నిత్యజీవము కాదు. నిత్యజీవము అనేది దేవుని ఉచిత కృపవలనే పొందుతాము అని పౌలు భక్తుడు తన పత్రికలో నొక్కి ఒక్కాణించాడు (ఎపెసి 2:8-9, రోమా 11:6, గలతీ. 2:16,21).

ఈ రెండు సత్యాలను వాటి వాటి సందర్భాలను బట్టి బోధించాలి. లేకపోతే ఒక సత్యాన్ని వివరించే సందర్భంలో పొరపాటున రెండొవ సత్యాన్ని బోధించే అవకాశం ఉంది. ఉచితముగా కుమారుడైన క్రీస్తు బలియార్పణ ద్వారా మనకు లభించిన "నిత్యజీవము"ను క్రియల ద్వారా మనము సంపాదించుకోవాలి అని తప్పుగా బోధించే అవకాశం కలదు. నిత్యజీవము అనేది దేవుని కృప ద్వారా వచ్చే "బహుమతి" (దానము). అయితే ఈ నిత్యజీవము క్రియల ద్వారా వచ్చే "ప్రతిఫలం" అని బోధించటం తప్పు. దేవుని కృప ద్వారా క్రీస్తునందు మనము ఉచితముగా పొందిన బహుమతియే నిత్యజీవము. క్రియల వలన కలిగినది కాదు అని పౌలు స్పష్టముగా చెప్పాడు. క్రియల వలన పొందేది "ప్రతిఫలం" అని బైబిల్‌లో స్పష్టంగా వ్రాయబడి ఉన్నది. ఎవని క్రియల చొప్పున వానికి ఫలము అనుగ్రహించబడుతుంది (2 కొరింథీ. 5:10). ప్రతిఫలము అనే మాటకు చేసిన దానిని బట్టి ఇచ్చే జీతము లేక వేతనము అని అర్థము. "బహుమతి" (దానము), వేతనమును కలిపి బోధించుట వలననే నిత్యజీవమును గూర్చిన సత్యం విశ్వాసులకు సరిగా అర్థం కావటంలేదు. అలావాడకపోవటం వలననే నిత్యజీవమును గుర్చిన గందరగోళ పరిస్థితి ఏర్పడింది. " బహుమతి (దానము) గా వచ్చిన నిత్యజీవము గూర్చి చెప్పాలంటే ఇది క్రీస్తు సిలువలో ముగించి సమాప్తి చేసిన క్రియద్వారా మనము పొందాము (యోహాను 1:4) "బహుమతి" (దానము) అనేది పొందే వాని యొక్క క్రియల మీద ఆధారపడిలేదు. ఇచ్చే వాని బట్టి ఔన్నత్యాన్ని బట్టి ఉంటుంది. ఇది దేవుని కృపయే గాని, క్రియల వలన కాదు. ఎవరు అతిశయపడకూడదు అని పౌలు భక్తుడు తన పత్రికలో నొక్కివొక్కాణించాడు. (ఎఫెసి. 2:8-9, రోమా 11:6, గలతీ. 2:16,21). చాలా వాక్యాలు, మనము చేసే క్రియలను బట్టి, మంచిగాని, చెడుగాని ఫలితాలను పొందు తాయని వివరించాయి (ప్రకటన 20:12-15). జీవ గ్రంథంలో పేరు నమోదు చేయబడినవారు మాత్రమే ఈ శిక్షను తప్పించుకొనగలరు.

ఇప్పుడు నిత్యజీవము అనేది దేవుని ఉచిత కృపయే గదా. క్రియల వలన కాదు గదా విశ్వాసులు యధేచ్ఛగా పాపము చేయవచ్చును గదా! అని చాలా మంది ప్రశ్నిస్తుంటారు అలా ఎన్నటికి వీలు లేదు. అది చాలా తప్పు. " మోసపోకుడి దేవుడు వెక్కిరించబడడు.", "సర్వశక్తుడు న్యాయము తప్పడు" "ఆయన త్రాసు సరియైన గుండు గలది", "వాని వాని క్రియల చొప్పున ప్రతి వానికి ప్రతి వానికి ఇచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము" అని వ్రాయబడియున్నది. "వాని వాని", "ప్రతి వాని" అంటే విశ్వాసియైనవాడు గాని, అవిశ్వాసియైనవాడు గాని అని అర్థము. కాబట్టి విశ్వాసులు కూడా వారి క్రియల చొప్పున క్రీస్తు న్యాయ పీఠము ఎదుట తీర్పు పొందెదరు (2 కొరింథీ 5:10, రోమా 14:10, మత్తయి 16:27, 1పేతురు 1:17, ప్రకటన 11:18) విశ్వాసిలో పాతదైన శరీరము, తిరిగి జన్మించుట ద్వారా కలిగిన నూతన జీవము "ఆత్మ" రెండు ఒకేసారి పనిచేస్తుంటాయి.

**(సశేషం)**

# క్రైస్తవ జీవిత దృక్కోణం

జీవితం చాలా విలువైనది మరియు ప్రశస్తమైనదని మన అందరికి బాగా తెలుసు. ఈ జీవితం పోతే మరల తిరిగి రాదు. అంతే కాదు మరల దీనిని తిరిగి మనం అనుభవించ లేము. అందుకే జీవితాంతం మనం సుఖంగా జీవించటానికి ఎన్నో ప్రయత్నాలు మరెన్నో ఆలోచనలు చేస్తూ వాటిని అవలంబించటానికి వాటిని సాధించటానికి ప్రయత్నం చేస్తూ వుంటాము. జీవితాన్ని సుఖవంతం లేదా ఆనందమయం చేసుకోవటానికి కొందరు బోధించే మంచి మార్గాలలో నడుస్తు వుంటాము. కొంతమంది సుఖవంతమైన జీవితం. డబ్బులో, మరి కొంతమంది సమాజసేవలో, మరికొంత మంది ఆధ్యాత్మిక చింతనలో దొరుకుతుంది అని వాటివెంట పరి గెత్తుతు కొంత కాలానికి అగమ్యగోచరంగా ఎందుకు ఇటు వైపు వచ్చామా? అని ప్రశ్నార్ధకంగా ఆలోచిస్తూ వుంటారు. అనగా వారి ఆలోచన మరియు మార్గము సరియైనది కాదు అని అర్ధమౌతుంది. 95% మంది ప్రజలు తమ జీవితాలను రుచికరంగా లేదా అర్ధవంతంగా కొనసాగించలేక పోతున్నారు అనేది నేటి వాదన. అవును కదా! ఎన్నో ఆలోచనలలో ఎన్నో ఉద్దేశాలు మనకు ఉన్నప్పటికి వాటిని నేరవేర్చుకోలేక మనంతట మనం రాజీ పడిపోయి జీవిస్తువుంటాం. ఉదాహరణకు 70,000/- నెలకు సంపాదించే ఒక ఉద్యోగిని తీసుకొనండి. అతడు మొదట ఆ జీతము కొరకు ఆశపడి ఉద్యోగం చేయటానికి ఒప్పుకొని తరువాత దాని మీద విరక్తి చెందవచ్చు. అనగా అతనికి జాబ్ సాటిస్ఫాక్షన్ లేదు అని మనం చెప్పగలుగుతాము. కాని బయటవారు అతని గురించి ఎంతో గొప్ప జీవితం అని అతను ఎంతో ఆనందంగా జీవిస్తున్నాడు, సుఖవంతంగా జీవిస్తున్నాడని చెప్పుకుంటారు. కాని వాస్తవానికి అతనికి ఆ జీవితం నచ్చదు. ఈనాడు చాలామంది తమ జీవితాలను అర్ధవంతంగా గడపలేక ఒత్తిడికిలోనై ఎన్నో రోగాలకు గురి అవుతుంటారు. ఈ ఒత్తిడి జయించలేని కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. అయితే ప్రభువైన యేసు క్రీస్తు వీరి గురించి చాలా స్పష్టంగా కొన్ని మాటలను మన కొరకు వివరిస్తున్నాడు. **మార్కు 14:3-7** "ఆయన బేతనియలో కుష్ఠరోగియైన సీమోను ఇంట భోజనమునకు కూర్చుండి యున్నప్పుడు ఒక స్త్రీ మిక్కిలి విలువ గల అచ్చ జటామాంసి అత్తరు బుడ్డి తీసికొని వచ్చి, ఆ అత్తరు బుడ్డి పగులకొట్టి ఆ అత్తరు ఆయన తల మీద పోసెను. అయితే కొందరు కోపపడి ఈ అత్తరు ఈలాగు నష్టపరచనేల? ఈ అత్తరు మున్నూరు దేనారముల కంటె ఎక్కువ వెలకమ్మి బీదలకియ్య వచ్చునని చెప్పి ఆమెను గూర్చి సణుగుకొనెను. అందుకు యేసు ఇట్ల నెను. ఈమె జోలికిపోకుడి ఈమెను ఎందుకు తొందర పెట్టుచున్నారు? ఈమె నా యెడల మంచి కార్యము చేసెను".

ఈ సన్నివేశాన్ని చదువుతుంటే ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలు మనకు బోధపడుతుంటాయి. కాకపోతే వాటిని మనం గ్రహించగలిగే శక్తి మనకు వుండాలి. యేసుప్రభువు ఆయన పరలోక సత్యాలను ఉపమాన రూపంలోను, బాడీ లాంగ్వేజ్ తోను మరియు కొన్ని సన్నివేశాలు బోధించకుండానే మనకు ఎన్నో సత్యాలు వివరించాడు. ఉదాహరణకు వ్యభిచారముతో పట్టుబడిన స్త్రీని రాళ్ళతో కొట్టడానికి ముందు వారు యేసు యొద్దకు తీసికొని వచ్చినప్పుడు యేసు వారితో ఏమి మాట్లాడ కుండా నేలపై వ్రాసాడు. అనగా ఇక్కడ ఆయన మౌనము వారికి గుణపాఠం నేర్పింది. అంతేకాదు. ఆయన గాడిదను అధిరోహించి అంగరంగ వైభవంగా తన జన్మ స్థానానికి ఊరేగింపుగా వస్తున్న సందర్భంలో అక్కడ యేసు ఏమి బోధించలేదు. కాని ఆసన్నివేశం ఎన్నో ప్రవచనాలను వాక్యాలను నెరవేర్చెను. అంత మాత్రమే కాదు సుంకపుగుత్త దారుడైన జక్కయ్య మారు మనస్సు పొంది అబ్రహాము కుమారుడుగా తీర్చబడ్డాడు. ఈ సన్నివేశాలలో యేసు నోరు తెరచి ఏమి బోధించలేదు. కాని ఆయన బాడీ లాంగ్వేజ్ ఎన్నో సత్యాలను వివరించి ఎంతోమందిని మార్చింది.

**(ఇంకావుంది)**

స్త్రీల విభాగము

# రూతు

ప్రభువు నందు ప్రియపాఠకులందరికి మన ప్రియ రక్షకుడు, విమోచకుడైన యేసుక్రీస్తు నామమున వందనములు. రూతు గ్రంథం నుండి దేవుని వాక్యమును ధ్యానించుచుండగా వాక్యమనే అద్దములో మన హృదయాలను చూచుకొని దేవునికిష్టమైన జీవితం జీవించుటకై పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయము చేయును గాక! ఆమేన్.

రూతు గ్రంథమందు నయోమి ఎలీమెలెకు తన ఇద్దరు కుమారులైన మహ్లోను, కిల్యోనులతో కలిసి కరువు కారణంగా యూదా బేత్లెహేమును విడిచి మోయాబు దేశానికి వెళ్ళారు. అక్కడ భర్త చనిపోయాక ఇద్దరు కుమారులు మోయాబు స్త్రీలను వివాహం చేసుకున్న 10సం॥లు తర్వాత ఇద్దరు కుమారులూ చనిపోవడం, తమ దేశమైన యూదాను దేవుడు దర్శించాడని విన్న నయోమి తన ఇద్దరు కోడండ్లైన ఓర్పా, రూతులతో కలసి బేత్లెహేముకు బయలుదేరడం, మార్గములో (1:7) మీ తల్లుల ఇళ్ళకు వెళ్ళండి అని అత్తయైన నయోమి చెప్పగా ఇద్దరు కోడండ్లు ఎలుగెత్తి ఏడ్చినట్లు, ఓర్పా మోయాబుకు తిరిగి వెళ్ళడం, రూతు మాత్రం నిన్ను విడువను, మరణం తప్ప నిన్ను నన్ను ఏది వేరు పరచదు అని పలికి స్థిర తీర్మానం తెలియజేయడం, రూతుకు తనతో వచ్చుటకు మనసు కుదిరిందని (1:18) గ్రహించిన నయోమి తనతో కోడలను తీసుకొని వెళ్ళడం గ్రంథంలో చదువుతాం. ఓర్పా, రూతు ఇద్దరూ మోయాబు స్త్రీలు, ఇద్దరు బేత్లెహేముకు బయలుదేరారు, తన వెంట వస్తే ఎలాంటి పర్యవసానాలు ఉంటాయో వివరించగానే ఓర్పా తిరిగి వెళ్ళింది, రూతు అత్తను హత్తుకుంది. లోకానందానికై జీవితానికై ప్రయాస పడుటకై వెళ్ళిన ఓర్పా, ఆత్మలో ఆనందంతో పాటు, ఇహలోకంలో లోటు లేని స్థితిలో ఉన్న రూతు; ఎటువంటి మెప్పులేని చరిత్రలో కనబడని స్థితిలో ఓర్పా, ఏడుగురు కుమారులకంటే ఎక్కువైన కోడలు అని పొగడ్తతో పాటు చరిత్రలో నిలిచిన రూతును మనం చూస్తాం.

ఇక్కడ నయోమి గురించి ఆలోచిస్తే ఒంటరి, వయస్సు మళ్ళిన స్త్రీ, చేతిలో ఏమిలేని స్థితిలో ఉన్న అత్త వెంట వెళ్ళడానికి ఇష్టపడ్డారు ఇద్దరు వయస్సులో ఉన్న కోడండ్లు.... అంటే ఆమె ప్రభావం కోడండ్లపై ఎంత ఉందో అర్థమౌతుంది. ఇద్దరూ ఆమె ప్రేమను రుచి చూచినవారే గనుక బయలుదేరారు. మార్గములో తన వెంట వస్తే ఎటువంటి సుఖము లేదని వివరించగానే ఓర్పా వెలుగెత్తి ఏడ్చి ముద్దు పెట్టుకొని వెళ్ళిపోయింది. ఒకసారి యేసయ్య శిష్యులతో మార్గమున వెళ్ళుచుండగా ఒక వ్యక్తి నీవెక్కడికి వెళ్ళిన నీ వెంట వస్తానన్నాడు (లూకా 9:57,58) నక్కలకు బొరియలు ఆకాశపక్షులకు నివాసములు ఉన్నాయి, మనుష్యకుమారునికి తల వాల్చుకొనుటకైనను స్థలము లేదనగానే అతని అడ్రసు కనబడినట్టు గ్రంథములో వ్రాయబడలేదు. ఓర్పాకు అత్త మీద ప్రేమ కంటే తన మీద జాలి ఎక్కువ (లూకా 9:23) తన్ను తాను ఉపేక్షించుకొని తనను వెంబడించువాడు ప్రభువుకు కావలెను. ఓర్పాకు అత్త అంటే ఇష్టమే, అత్త తనను ఎలా ప్రేమించిందో తనను సంతోషపెట్టుటకై, తన క్షేమముకై అత్త ఏమేమి చేసిందో అంతా తెలుసు. అత్తలోని స్పెషాలిటి తెలుసు. (ప్రేమ, దయ, నిస్వార్థం, మంచితనం, భక్తి అన్ని) మోయాబులో అంతా వెదికినా ఇలాంటి వ్యక్తి కనబడరు. అయినా అత్తను వెంబడించి సంతోషపరచుటకు సమర్పించుకునేంతగా ప్రేమించలేకపోయింది. చాలా మందికి యేసయ్య అంటే ఇష్టమే, ఆయన ప్రేమ తెలుసు, తమకొరకు ఏమి చేశాడో తెలుసు "నీ వంటి వారు ఒక్కరును లేరు......" పాడటం వరకే, అన్నీ మెదడు వరకే హృదయములోనికి పోనివ్వనివారు

అనేకులున్నారు. దేవుడు ఇచ్చేవన్ని అనుభవిస్తూ దేవునికి హృదయం, మనస్సు ఇవ్వని వారు దేవుని కంటే సుఖానుభవాన్ని ప్రేమించువారు, పైకి భక్తి గలవారుగా నుండి దాని శక్తిని ఆశ్రయింపనివారు (2తిమోతి 3:4,5) యేసయ్య దీవెనలు ఆశీర్వాదాలు కావాలి కానీ యేసయ్యను అనుసరించుట, ఆయన భారం, బాధ పంచు కోవడం మాత్రం వద్దు (పట్టదు). ఈ లోకం వరకే దేవునిపై నిరీక్షణ గలవారమైతే మనుష్యులందరికంటే దౌర్భాగ్యులము (1కొరింధీ 15:19) అని దేవుని వాక్యం తెలియజేస్తుంది. "లోకాన శాశ్వతానందమేమియు లేదని చెప్పెను ప్రియు దేసు" అని నోటితో పాట, లోకములోని ఆనందానికై ప్రాకు లాట. దేవుని కొరకు ఏమి చేస్తున్నాం అని ఆలోచించని హృదయం దూరంగా ఉన్న ఓర్పాలెందరో. "ఆవిరి వంటిది జీవితం అని పాడుతూనే ఈ జీవితమే శాశ్వతం. ఏదీ మిస్ కాకూడదు, ఏదీ తక్కువ కాకూడదు, లోకాన్ని అనుభవిం చాలని లోకంలో ఆనందించాలని కోరిక వాటికై ఏడ్పు. ఓర్పా ఏడ్పు వేరు, రూతు ఏడ్పు వేరు. లోకానుసారమైన దుఃఖం మరణం కలుగజేయును (2కొరింథీ 7:10) రూతు ఏడ్పు జీవాన్నిచ్చింది. స్థిర తీర్మానాన్ని తీసుకునేలా చేసింది.

ఓ సారి ఒక చోట వాక్యం విన్న సోదరి "ఎన్ని సం॥లకు నా ప్రశ్నకు జవాబు దొరికింది. ఎందుకు ఏడ్చి ప్రార్ధిస్తారు? ఏడ్పు ఎందుకు? అనుకునేదాన్ని" అన్నది. ఆ సోదరి వాక్యాన్ని వినే ముందే సాక్ష్యాలు అందించే సమయంలో దేవుడు తనకు ఎలా సహాయం చేశాడో సాక్ష్యం ఇచ్చింది. ఇలాంటి యేసయ్య మనస్సు, భారం ఎరుగని వారు ఎంత మంది ఉన్నారు? జీవితం ఎందుకు జీవిస్తు న్నామో ఆలోచించని వారెంతమంది? ఓర్పాను అత్త వెళ్ళమంది. ఓ.కే వెళ్తానంది. ముద్దుతో సరి. ఇన్ని సం॥ల సంబంధం ఏమైంది? అత్త గతికి అత్తను వదిలేసిన ఓర్పా ముద్దుకు, ఇస్కరియోతు యూదా ముద్దుకు తేడా ఉందంటారా? చాలా మంది నోటితో యేసయ్యకు థ్యాంక్స్ చెప్తే, స్తోత్రం చెప్తే సరిపోతుందనుకుంటూ హృదయంలో దేవునికి దూరంగా ఉన్న (మత్తయి 15:7-9) ఓర్పాలెందరు? లోకాన్ని ప్రేమిస్తావా? యేసయ్యనా? డబ్బుకు ఓటేస్తావా? యేసయ్యకా? అంటే చాలా మంది వాక్యాన్ని సీరియస్‌గా తీసుకోకుండా లోకాశలకు డబ్బుకు విలువనిస్తూ యేసయ్యకు దూరంగానున్నారు (తెలియకుండానే దేవున్ని విడిచి నడుస్తున్న ఓర్పాలు) (1యోహాను 2:15-17)

అత్తకు తెలుసు ఓర్పా హృదయం, రూతు హృదయం, అందుకే ముగ్గురు బేత్లెహేముకు ప్రయాణమైనారు. మార్గములో ఈ ప్రస్తావన తెచ్చింది. దేవుడు ఎవర్ని బలవంతంగా తన మార్గములో నడిపించడు. స్వేచ్ఛ ఏది కావాలో కోరుకో, ఓర్పా మోయాబును కోరుకుంది చాప్టర్ క్లోజ్. లోకం దాని ఆశ గతించును దేవుని విడిచిపోవునట్టి దుష్టహృదయం మీలో ఉందేమో చూచుకొనుడి (హెబ్రీ 3:12). పరలోకంలో ప్రవేశించాలని ప్రయత్నించేవారు అనేకులు, చేరువారు కొందరే. (2 తిమోతి 4:10) దేమా విడిచి వెళ్ళారు. శరీరానుసారమైన మనస్సు గలవారు దేవుని సంతోషపెట్టలేరు (రోమా 8:8). ప్రభువా! ప్రభువా! అనే వారు ప్రవేశింపలేరు, దేవుని మనసు ఎరిగి దేవుని చిత్తం చేయువారు ప్రవేశిస్తారు (మత్తయి 7:21). భజన చేసే భక్తులు కాదు దేవునికి కావల్సింది. ఆయన చిత్తం జరిగిస్తూ ఆయనకై జీవించే శిష్యులు (కొందరు కాదు సమస్త జనులు) మత్తయి 23:19. రూతు ఊహ తెల్సినప్పటినుండి తనవారిని గమనించింది. శరీరం యొక్కయు, మనస్సు యొక్కయు కోర్కెలు నెరవేర్చుకొనుచు దైవోగ్రత కిందనున్న జనులతో సాగిపోతున్న తనకు అత్తతో సహవాసం జీవిత విలువ ఏంటో తెలియజేసింది. అత్తలోని ప్రేమ, దయ, మంచితనం, నిస్వార్థం, త్యాగం, పరిశుద్ధత తనను కట్టి పడేశాయి. తనను ప్రాణంగా ప్రేమించిన అత్త సహవాసం లేకుండ జీవించలే ననుకొంది. అత్తతో సహవాసమే నిజమైన ఆనందం. అత్తలేని మోయాబు ఆనందం " ఆనందం ముసుగేసుకున్న దుఃఖం" అని తెలుసుకుంది. మోయాబు జీవితం గతించిన కాలమే చాలు (1పేతురు 4:1-3). అత్తలోని ప్రత్యేకత చూశాక తెలుసుకుంది జీవితం ఎందుకో. పరిశుద్ధతలో,

**...మిగతా 15వ పేజిలో**

10



బ్రదర్ కె.సామ్రాట్

# మదర్‌తెరీసా

అప్పుడు రాజు తన కుడివైపున ఉన్న వారిని చూచి – నా తండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి, దప్పిగొంటిని నాకు దాహమిచ్చితిరి, పరదేశినై యుంటిని నన్ను చేర్చుకొంటిరి, దిగంబరినై యుంటిని నాకు బట్టలిచ్చితిరి, రోగినైయుంటిని నన్ను చూడ వచ్చితిరి, చెరసాలలో ఉంటిని నా యొద్దకు వచ్చితిరని చెప్పును. అందుకు నీతిమంతులు – ప్రభువా, ఎప్పుడు నీవు ఆకలిగొనియుండుట చూచి నీకాహార మిచ్చితిమి? నీవు దప్పిగొనియుండుట చూచి ఎప్పుడు దాహమిచ్చితిమి? ఎప్పుడు పరదేశివైయుండుట చూచి నిన్ను చేర్చుకొంటిమి? దిగంబరివైయుండుట చూచి బట్టలిచ్చితిమి? ఎప్పుడు రోగివై యుండుటయైనను, చెరసాలలో ఉండుటయైనను చూచి నీ యొద్దకు వచ్చితిమని ఆయనను అడిగెదరు. అందుకు రాజు – మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును. ఇదే మదర్ తెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్ యొక్క కాన్‌స్టిట్యూషన్‌లోని ప్రధాన భాగమైనది. ప్రభువైన యేసయ్య మాటలు ఎప్పుడూ తన హృదయంలో పదిలంగా వుంటూ వాటి ఆచరణే ఆమె జీవిత ధ్యేయమైనందున ఏనాడూ అపజయము పొందలేదు. అపవాదికి చిక్కలేదు.

లేఖనాల్ని గుర్తు చేసుకొని ప్రభువు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసుకొనుట వలన దేవుని నడిపింపు, ఆయన చిత్తము మనకు తెలుపబడుతుంది. అపొ.కార్య.11:16లో పేతురుకు యేసుప్రభువు చెప్పిన మాట జ్ఞాపకము చేసుకొనెనని వ్రాయబడినది. మదర్ తెరీసా వద్ద చేరిన అమ్మాయిలు ఇద్దరిద్దరుగా వెళ్ళి పేదవారి సేవలో పని చేస్తుండేవారు. ఈ విధంగా ఇద్దరిద్దరుగా వెళ్ళుట వలన ఒకరికొకరు సహాయము గాను, భద్రతగాను ఉంటుందని ఒక తెలివైన పెద్దాయన గమనించి చెప్పినప్పుడు మదర్ తెరీసా ఖచ్చితంగా ఏమని జవాబు చెప్పారంటే, ఇద్దరేసి వెళ్ళుటలో వారి భద్రతకు సంబంధించినదేమీ కాదుగాని, ప్రభువైన యేసు లూకా 10వ అధ్యాయంలో తాను వెళ్ళబోవు ప్రతి ఊరికిని ప్రతి చోటికిని తనకంటె ముందు ఇద్దరిద్దరినిగా పంపినట్లు తెలియజేసింది. అంటే ప్రభువు చెప్పిన ఆజ్ఞను అమలుపరచుట ద్వారా వాళ్ళ నియమావళిలో ఒక భాగమైంది. యేసుప్రభువు శిష్యులులాగా యిద్దరిద్దరు కలసి హాస్పిటల్‌కి, కుష్ఠురోగుల దగ్గరికి వెళ్ళాలి.

1949లో భారతదేశము మామూలు స్థితికి చేరింది. అయినను నిర్భాగ్యులైన పేదరికము, వ్యాధిబాధలు మాత్రము ప్రబలంగానే వున్నాయి. క్రొత్తగా స్వాతంత్ర్యం పొందిన భారత దేశానికి తనవంతు ధైర్యాన్ని సమకూర్చాలని మదర్ తెరీసా భావించింది. గాంధీగారికి అతి ప్రియుడైన జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా భారతదేశాన్ని ముందుకు తీసుకెళు తున్నారు. ఆమెకు భారతదేశ పౌరసత్వం ఇవ్వబడింది. ఒకరోజు మైఖేల్ గోమ్స్‌గారితో ట్రామ్‌లో హౌరాకు ప్రయాణం చేస్తుండగా కొందరు ఆమె గురించి బెంగాలిలో ఈ విధంగా అంటున్నారు. ఈ ఐరోపా తెల్ల మహిళ కలకత్తాకు వచ్చి ఎందరో భారతీయ హిందువుల్ని క్రైస్తవ మతంలోకి మారుస్తుంది. ఈ విదేశీయురాలు ఆ పనంతా డబ్బుకోసం చేయటంలేదని మరింత మందిని క్రైస్తవమతంలోకి మార్చేందుకు చేస్తున్నారని అంటున్నారు. వాళ్ళనుకునే మాటలన్నీ ఆవిడకు అర్థమవుతూనే వున్నాయని ఆమెకు తెలియదు. మదర్ తెరీసా సెయింట్ మేరీస్‌లో బెంగాలీలోనే బోధించింది. చాలాసేపు ఆమె ఏమీ మాట్లాడకుండా వాళ్ళు అంటున్నదంతా విన్నది. ఆఖరుకు వాళ్ళ వైపు తిరిగి “అమె భారతార్‌రీ భారత్ అమర్” అంది. నేనూ భారతీయురాల్ని,

భారతదేశం నాది అని దానర్ధం. వాళ్ళ నోట మాట రాలేదు. మైఖేల్ గోమ్స్ అది విని ఎంతో సంతోషించాడు. మదర్ తెరీసా తన కార్యకలాపాల్ని ప్రారంభించిన కొన్ని నెలల్లోనే, 1950 సంవత్సరం మొదట్లో ఆర్చ్ బిషప్ పెరియార్ తుది నిర్ణయం తీసుకున్నారు. ఆవిడ అడుగు వేసిన దారికి అనుకూలంగా వుందా నిర్ణయం. ఆయన ఏప్రిల్ నెలలో రోమ్ నగరం వెళుతున్నారు. ఆ లోపు మదర్ తెరీసా స్థాపించబోయే సంస్థ నియమావళి అయిదు కాపీలు తీసుకుని కార్డినల్ పెట్రస్ ఫమాస్ని బియోండికి యివ్వాలని ఆయన సంకల్పం. ఆ కార్డినల్ ఆఫీస్ ఫర్ ది ప్రొపగేషన్ ఆఫ్ ఫెయిత్ సంస్థకు అధిపతి. తుది గుర్తింపు ఇవ్వవలసింది ఆయనే. ఆర్చ్ బిషప్ ఆదేశానుసారం ఫాదర్ నాన్ ఎగ్జిమ్, మదర్ తెరీసా నియమావళి తయారు చెయ్యడం మొదలు పెట్టారు. 275 నియమాలతో "కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ది మిషనరీస్ ఆఫ్ ఛారిటీ" తయారు చేశారు. అందులో ముఖ్యమైంది. డార్జిలింగ్ ప్రయాణంలో మదర్ తెరీసాకు యేసుప్రభువు పిలిచిన పిలుపు. తను కాన్వెంట్ వదలిపెట్టాలి. పేదవాళ్ళలాగా బతకాలి, తన కార్యకలాపాలు వుండవలసింది మురికివాడల్లో. కలకత్తా వీధుల్లో దిక్కులేక వదిలేసిన పసిగుడ్డులు, పిల్లలు, కుష్ఠు వ్యాధిగ్రస్తులూ, మరణ సన్నిధిలో వున్న అభాగ్యులువంటి వాళ్ళకోసమే. "పవిత్రత, పేదరికం, విధేయత" ఈ మూడింటినీ మనస్ఫూర్తిగా అంగీకరిస్తూ నాలుగో ప్రమాణాన్ని మదర్ తెరీసా తీసుకున్నారు. "నిరుపేదలకు మనఃస్ఫూర్తిగా స్వచ్ఛంద సేవ" చెయ్యడం. దీనివల్ల మృత్యుముఖంలో వున్న వాళ్ళకి, నిరాదరణకు గురైన వారికి, సంఘ బహిష్కృతులకు, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు జీవితంలో సకల విశ్వాసాన్ని, ఆశని పోగొట్టుకున్న వాళ్ళకి భౌతికంగా, ఆధ్యాత్మికంగా ఆహారం, వస్త్రం, రక్షణ, సేవ కల్పించే కర్తవ్యం మిషనరీస్ మీద వుంటుంది.

1950 అక్టోబర్ 7న మదర్ తెరీసా స్థాపించిన క్రొత్త సమాజానికి పోప్‌గారి ఆమోదం లభించింది. గోమ్స్‌గారి భవనంలో ఆర్చ్ బిషప్ పెరియార్‌గారు స్వయంగా వచ్చి ఫాదర్ వాన్‌ఎగ్జెమ్, ఫాదర్ హెన్రీలతో కలసి దివ్యపూజ ప్రార్ధన జరిపించారు. ఆ ప్రార్ధనలో ఆ స్థాపనా శాసనాన్ని ఫాదర్ వాన్‌ఎగ్జెమ్ చదివి వినిపించారు. "మదర్ తెరీసా పర్యవేక్షణలో ఈ సమాజం ఏర్పడుతుంది. దయార్ద్ర హృదయంతో నిర్భాగ్యులను ఆదరించాలన్న దీక్ష హర్షనీయం. అనాధలైన పిల్లల్ని, పెద్దల్ని ముసలివారిని, నిరాధారులైన పేదలకు, రోగులకు, మరణించే వారికి నిరుపయోగులకి త్రోసివేయబడిన వారికి సేవ చెయ్యాలన్న సత్సంకల్పం అభినందనీయం. కష్టనష్టాలను భరిస్తూ, శక్తి వంచన లేకుండా, వాడవాడలా తిరిగి గ్రామాలకు వెళ్ళి, ఎంతో ఓర్పుగా అవసరంలో వున్న వారికి అందించే సేవలను పరిశీలించిన పిదప, యేసుక్రీస్తు ప్రేమను లోకానికి వెల్లడించాలన్న ఏకైక లక్ష్యంతో మదర్ తెరీసా స్థాపించిన సమాజం చేస్తున్న అవిరళ కృషికి సంపూర్తిగా తెలుసుకున్న తర్వాత, ఈ సంఘానికి అధికార పూర్వకమైన గుర్తింపు నివ్వడం జరిగింది. ఇక నుంచి ఈ సమాజం మిషనరీస్ ఆఫ్ ఛారిటి అనే పేరున ఉదహరిస్తుంది. ఈ పత్రానికి ఆర్చ్ బిషప్‌గారు ఆమోద ముద్రవేసి మదర్ తెరీసాకు అందించారు.

పదకొండుమంది సిస్టర్స్‌తో మదర్ క్రొత్త సమాజాన్ని స్థాపించింది. ఆ తర్వాత రెండేళ్ళలో మదర్ తెరీసా మిషనరీస్ ఆఫ్ చారిటి సంస్థలో ముప్పై మంది చేరారు. పై అంతస్తు మొత్తం నిండిపోయింది. అది చాలక మదర్ తెరీసా పైన మిద్దె మీద తాత్కాలిక ఏర్పాటుగా ఒక గది వేశారు. ఇంకా స్థలం సరి పోవడం లేదు. రెక్కలు విప్పుకుంటూ వున్న మదర్ తెరీసా మిషనరీస్ ఆఫ్ చారిటి సంస్థపట్ల ఫాదర్ హెన్రీ, ఫాదర్ వాన్ ఎగ్జిమ్ ఎప్పుడూ ఆసక్తి చూపిస్తూనే ఉన్నారు. వాళ్ళు మళ్ళీ సైకిళ్లు వేసుకొని పెద్ద నివాసము కొరకు వెతకడం ప్రారంభించారు. సిస్టర్లు ప్రత్యేక ప్రార్ధనలు చెయ్యడం మొదలు పెట్టారు. ఒకరోజున ఒకాయన క్రీక్‌లేన్‌కి వచ్చి అనుకూలమైన భవనం ఒకటి అమ్మకానికి వుందని మదర్ తెరీసాతో చెప్పాడు. అది 54ఎ, లోయర్ సర్క్యులర్ రోడ్‌లో వుంది. మదర్ తెరీసాను వెళ్ళి చూడమన్నాడు. ఆ ఇంటి యజమాని పేరు డాక్టర్ ఇస్లామ్. ఆయనో మేజిస్ట్రేట్. మదర్ తెరీసా వెళ్ళి చూశారు. అంతా బాగానే వుంది కాని మదర్ దగ్గర చిల్లి గవ్వలేదు. ఆ భవనాన్ని కొనాలంటే సాధ్యమయ్యే విషయమేనా? పైగా అది కలకత్తా నగరం మధ్యభాగంలో బాగా రద్దీగా వుండే ప్రాముఖ్యమైన స్థలంలో వుంది. ఆమె ఆలోచనలో పడింది. అది దైవ సంకల్పమైతే ఆయనే డబ్బు విషయం చూసుకుంటాడనే సరిపెట్టుకుంది. డాక్టర్ ఇస్లాం సెయింట్ జేవియర్ కాలేజీలో చదువుకున్నాడు. **(సశేషం)**

సాక్ష్యము

# యేసు నా రక్షకుడు

బాల్యములోనే తండ్రిని పోగొట్టుకొని మేనమామ గార్ని ఆశ్రయించాను. హిందూ సాంప్రదాయకుటుంబములో జన్మించాను. కాని ప్రభువు మహాదయవల్ల నాతల్లి మేన మామగార్లు ప్రభువును నమ్మారు. థామ్సన్ మిస్సమ్మ గారి బోధలవల్ల మా అమ్మగారు శ్రీమతి మహాలక్ష్మి బాప్తిస్మము తర్వాత జమాయమ్మ పేరుతో తన స్వీయ రక్షకునిగా ప్రభువును స్వీకరించారు. నా అసలు పేరు మంగమ్మ. నా 9సం॥ల వయస్సులో అమ్మతో పాటు బాప్తిస్మము తీసుకొని సుగుణమ్మగా మారాను. మా బంధువులంతా అన్యదేవతల్ని ఆరాధించేవారు. ఇప్పటికి కొందరు అదే విశ్వాసంలో ఉన్నారు. నేనైతే దేవుని నమ్మకములో పెరిగాను. రక్షణానుభవంలో ఉన్నాను. కీర్తనలు 52:8, నేనైతే దేవుని మందిరంలో పచ్చని ఒలీవ చెట్టువలె ఉన్నాను. దేవుని కృపయందు నమ్మికయుంచు చున్నాను. నేనైతే ప్రభువుని వెంబడించుటలో ప్రత్యేక క్రమాన్ని క్రీస్తువలె వాడుక చొప్పున వాక్యపఠనము, ప్రార్థన బోధించుటయందు ఎడతెగక ఉండునట్లు ప్రభువు నన్ను బాగుగ ఆశీర్వదించారు.

నా 15సం॥ల వయస్సులో మల్లయ్యగారితో హిందూ పద్ధతిలో వివాహం చేసుకున్నాను. బంధువుల ఒత్తిడివల్ల తప్పించుకోలేకపోయాను. నా పెండ్లి కార్యక్రమమునకు బంధువులు అవసరమని తప్పలేదు గాని ఆ తరువాత పూజలకు నన్ను ఒత్తిడి చేయలేదు. ప్రార్థనతో, విశ్వాసంతో వివాహ జీవితం సాఫీగా సాగింది. నాకు దేవుడు ముగ్గురు మగ బిడ్డలను స్వాస్థ్యముగా బహుకరించారు. ఒకసారి మాత్రమే నా ఆచారంలో పొరబాటు చేశాను. పెదబాబు పుట్టినపుడు శాంతి చేయించాము. మనస్సు నొచ్చుకుంది. దేవున్ని క్షమాపణ దావీదు (కీర్తన 51) వలె గోజాడి పొందుకున్నాను. ఆ తరువాత నవంబర్ నెలలో కార్తీక మాసంలో నోములువంటి ఆచారాలన్నీ తప్పించుకున్నాను. ముగ్గురు బిడ్డలను విశ్వాసంలో పెంచాను. అద్భుతరీతిగా నా భర్త మల్లయ్య గారు కూడ బాప్తిస్మ అనుభవం పొందారు.

నాశరీరం క్రమేపి క్షీణించనారంభించింది. నరాల బలహీనత, అనేక సమస్యలు చుట్టుముట్టాయి. అన్నిటిలో దేవుని ప్రార్థించగా, ఆ సమస్యలలో దేవుడే నాకు కొండగా కోటగా, కాపరిగా ఉండి నడిపించారు. పెద్దబాబు పుట్టినప్పుడు (నా వయస్సు 18సం॥లు) నాకు నరాల బలహీనత ఆవరించి, ప్రమాద స్థితిని ఎదుర్కొన్నాను. 4నెలలు ఆస్పత్రి పాలయ్యాను. రోజు రూ.8 ఇంజక్షన్‌లు చేసేవారు. అప్పట్లో ఆధునిక వైద్యం, మందుల లోపం వల్ల ఒక ఇంజక్షన్ రియాక్షన్ వల్ల శరీరమంతా నీలం రంగుగా మారి డాక్టర్లు బ్రతుకుట అసాధ్యమని ఇంటికి కబురు చేశారు. నా బలహీనతలో దేవుని శక్తి పరిపూర్ణమౌతుందనీ, క్రీస్తు సిలువలో కార్చిన అమూల్య రక్తము ద్వారా తన బిడ్డగా చేసి విశ్వాసమందు నన్ను బలపర్చుతుంది గనుక తాను పొందిన గాయముల చేత నాకు స్వస్థత ఉందని ధృడ నమ్మకముతో "ప్రభువా నీవే నా రక్షకుడవు, నన్ను స్వస్థపరచు దేవుడవు నీవే. నీ కొరకు జీవించి నీకు సాక్షిగా నిలుస్తాను, కనికరించు దేవా" అని కన్నీటితో మొఱ్ఱపెట్టాను. ఆపత్కాలములో నేను నమ్ము కొనిన నా దేవుడు అదృశ్యరూపంలో నన్ను బ్రతికించారు. ఎవరు పెట్టారో తెలియదు గాని, నా సమీపంలో తెల్లని కప్పులో ఎరుపు రంగు జ్యూస్‌వలె ఉంది. అది నాకివ్వబడింది. అది ఎంతో మాధుర్యంగా తియ్యగా ఉంది. ఆ రుచి ఎన్నటికి మరువలేను. ఇది ఎవరిచ్చారు అని తలుస్తున్నప్పుడు "ఇది మనుష్యులు ఇచ్చింది కాదు యేసు రక్తం" అనే మెల్లని స్వరం వినబడింది. దేవున్ని ఎంతగానో స్తుతించి ఘన పరిచాను. మరుసటి రోజు నుండి అద్భుత స్వస్థత కలిగింది. నా ప్రమాద పరిస్థితి నాకు తెలియలేదు. మా మామయ్య, అమ్మ వచ్చి "నీకు మరణం తప్పింది" నీకు చావులేదు అన్నారు. హల్లెలూయా!

నా బిడ్డలందరినీ భక్తిలోనే పెంచాను. బాబు అమెరికాలో డాక్టర్. 1980లో నేను వారియొద్దకు U.S.A వెళ్ళాను. చిగురుపాటి దేవిడ్‌గారు వారి కుటుంబసభ్యులతో పరి

చయాలు ప్రార్థన సహవాసాలు సన్నిహిత సాంగత్యం నన్ను ఆత్మీయంగా స్థిరపరిచాయి.

ఒకరోజు రెస్టరూంలో అకస్మాత్తుగా పడిపోయాను. తలనొప్పితో బాధపడగా ఆస్పత్రిలో స్కానింగ్ తీసి బ్రెయిన్ ట్యూమర్ తప్పక ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. నేను బ్రతుకుతాననే ఆశ అడుగంటింది. కన్నీటితో ప్రార్థించసాగాను. చిన్నప్పటి నుండి నేను నేర్చుకున్న వాక్యాలు కీర్తనలు 147:3 గుండెచెదరిన వారిని ఆయన బాగుచేయువాడు. వారి గాయములు కట్టువాడు. 145:11 నిజముగా మొఱ్ఱపెట్టువారికందరికి యెహోవా సమీపముగా ఉన్నాడు. 143:11 యెహోవా నీ నామమును బట్టి నన్ను బ్రతికింపుము. 119:175 నీవు నన్ను బ్రతికింపుము. నేను నిన్ను స్తుతించెదను. 88:10,11 మృతులకు నీ అద్భుత ములు చూపెదవా? ప్రేతలు లేచి నిన్ను స్తుతించెదరా? సమాధిలో నీ కృపను స్తుతించెదరా? సమాధిలో నీ కృపను ఎవరైనా వివరింతురా? నాశనకూపములో నీ విశ్వాస్యతను ఎవరైనా చెప్పుకుందురా? అంధకారములో నీ అద్భుతములో తెలియునా? పాతాళములో నీ నీతి తెలియునా? యెహోవా నేను నీతోనే మనవి చేయుచున్నాను. నేను మరణిస్తే నీకు లాభమేమి ప్రభువా? నీవు నన్ను సజీవంగా ఉంచితే క్రీస్తే రక్షకుడని సాక్ష్యమిస్తాను. నాలో పరిపూర్ణత చూడగలిగితే నన్ను నీ సన్నిధిని చేర్చుకో. లేదా సజీవంగా ఉంచితే మంగళగిరిలోనే నీ సాక్షినౌతాను అని ప్రార్థించుకున్నాను. నా కుమారుడు డా.రావ్‌కి కూడ నా ఆరోగ్యం గూర్చి తెలుపలేదు. గానీ నా ప్రార్థనా అవసరతను డేవిడ్ గార్కి వారి తల్లి గార్కి తెలియపరిచాను. వారంతా సహవాసములో ప్రార్థనలు జరిపారు. ఇక్కడ నాకు ఆపరేషన్‌కు సిద్ధపరిచి కొందరితోపాటు తల కత్తిరించి సంసిద్ధంగా ఉంచారు. అందరి ఆపరేషన్లు పూర్తి చేశారు, కాని అద్భుత రీతిగా నాకు కొంత వ్యవధి ఇచ్చారు. ఎక్స్‌రేలు స్కానింగ్‌లు తీశారు. నేను వారి అనుమతికై కనిపెట్టే రోజుల్లో ఒక కల వచ్చింది. కలలో ఎవరో అజ్ఞాత వ్యక్తి అపరేషన్ చేసినట్లుగా చూచాను. ఆశ్చర్యకరుడైన పరమ వైద్యుడు క్రీస్తు నన్ను స్వస్థపరిచాడని విశ్వసించాను. అదే నమ్మకంతో డాక్టర్ గారి వద్దకు పరీక్షకు వెళ్ళినప్పుడు."నీకు ఆపరేషన్ అవసరం లేదమ్మా" అని చెప్పారు. చెప్పనశక్యము గాని సంతోషముతో దేవుని స్తుతించుకున్నాను.

చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయి దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరిగెత్తాలని నా ఆశ. నా కొడుకు సహాయంతో పేదవారికి విద్యా సేవ ఒక సంఘ నిర్మాణం జరిగింది. సహవాసం ఆరంభించాను. నా సేవ ఫలభరితం కావాలని ప్రార్థించండి. ఆమెన్.

---

**11వ పేజీ తరువాయి....**

త్యాగంలోనున్న తృప్తి, ఆనందం, నెమ్మది ఎందులోను లేవని, తనను వెంబడించుటకై తీర్మానించుకుంది (హెబ్రీ 11:24-26) "నే యేసుని వెంబడింతునని నేడేగ నిశ్చయించితి నే వెనుదిరగన్" రూతు అత్త వెంట నడిచింది, అత్త మాటకు విధేయత చూపింది, భూస్వామికి భార్య అయ్యింది. అంతకంటే ముందు కష్టపడింది, అత్త ఆకలి తీర్చింది. తర్వాత కుమారున్ని కని అత్తకు అందించి నీ కోడలు ఏడుగురు కుమారుల కంటే గొప్పదనే ప్రశంస పొంది తన అత్త సంతోషానికి గర్వించుటకు కారణమైంది (యోబు 1:3) తను ఆశీర్వదింపబడింది (మత్తయి 6:32,33)

చదువరీ! నీది ఓర్పా మనస్సా? రూతు మనస్సా? ఒకసారి వాక్యపు అద్దంలో చూసుకో. మోసపోకు. దేవుడు వెక్కిరింపబడడు. ఏది విత్తితే ఆ పంటనే కోయాలి (గలతి 6:7). దేవునితో ఉన్నామనుకుంటూ భూసంబంధ మనస్సుంటే వారు దేవుని సిలువకు శత్రువు లు (ఫిలిప్పీ 3:17-19). ఎవరిని ప్రేమిస్తున్నావు? లోకాన్నా? దేవున్నా? ఎవడైనను ప్రభువును ప్రేమింపకుంటే వాడు శపింప బడునుగాక అని వాక్యంలో ఉంది (1కొరింథీ 16:22).

కాబట్టి ప్రభువునకు ఆమోదకరమైన జీవితాన్ని జీవించిన రూతువలె జీవించడానికి కావలసిన జ్ఞానాన్ని తగ్గింపు జీవితాన్ని పొందడానికి అనుదినం ఆ దేవునిపై ఆధారపడుతూ, ప్రార్థిస్తూ, నిజమైన క్రీస్తు బిడ్డల వలె జీవిద్దాం.

సైన్స్

# ఎంత వరకు?

మనం ప్రతిరోజు ఏదో ఒక సందర్భములో నేటికి సైన్స్ చాలా అభివృద్ధి చెందింది, టెక్నాలజీ బాగా డవలప్ అయ్యింది అని అంటూ ఉంటాం కనీసం వింటూ ఉంటాం. వాస్తవానికి ఎంతగానో అభివృద్ధి చెందింది అనుకుంటున్న ఈ సైన్స్ లేదా టెక్నాలజి యొక్క పరిమితులు ఏంటో, దాని అవధులు ఏంటో శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల ఆధారంగా తెలుసుకుందాం. మనం పుట్టిన దగ్గర్నుండి చనిపోయేవరకు ఉండే ఈ భూమి గురించి ఆలోచిస్తే ఎవరికైనా వచ్చే మొదటి ప్రశ్న ఈ భూమిని ఎంత వరకు త్రవ్వగలం? అంటే భూమిని ఎంత లోతు వరకు త్రవ్వగలం? అని. ఇప్పటికి జరిగిన పరిశోధనల ప్రకారం భూమి యొక్క లోతు 6,371 కి.మీ గా కనుగొన్నారు. అంటే భూమి యొక్క మధ్య భాగానికి చేరాలంటే 6,371 కి.మీ లోతు త్రవ్వాలి. భూమి యొక్క ఒక చివరి నుండి మరొక చివరికి చేరడానికి 12,742 కి.మీ లోతు త్రవ్వాలి.

1989 సం॥లో సోవియట్ శాస్త్రవేత్తలు 12,262 మీటర్ల లోతున్న ఒక బోర్‌హోల్‌ని త్రవ్వారు. ఈ బోర్‌హోల్‌ని త్రవ్వడానికి 19 సం॥లు పట్టింది. అంతకంటే ఎక్కువ తవ్వడానికి సాధ్యపడలేదు ఎందుకంటే భూమి లోపల ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. 2012 వరకు భూమి మీద ఉన్న అతి లోతైన బోర్ హోల్ ఇదే. అయితే 2012లో రష్యాకి చెందిన ఎక్సాన్ కంపెనీ Z-44 అనే ఆయిల్ బోర్‌ను తవ్వడం జరిగింది. దీని లోతు 12,376 మీటర్లు. ఇంతకు మించి తవ్వడం ఎక్సాన్ కంపెనీ వల్ల కాలేదు. ఈ లోతు ప్రపంచంలోనే ఎత్తైన టవర్‌గా పేరు గాంచిన "బుర్జ్‌ఖలీఫ" తో పోలిస్తే ఈ లోతు 19 బుర్జ్‌ఖలీఫలతో సమానం. అయితే విచిత్రమేమిటంటే భూమి యొక్క పూర్తిలోతుతో పోలిస్తే ఈ లోతు 1% మాత్రమే. నేటికి కూడ భూమిపైన ఉన్న లోతైన త్రవ్వకం ఇదే.

***" జనులు తిరుగు స్థలములకు చాలా దిగువగా మనుష్యులు సొరంగము త్రవ్వుదురు...భూమి మీద ఆహారము పుట్టును దాని లోపలి భాగము అగ్ని మయమైనట్లుండును" యోబు 28:5***

మోడ్రన్ టెక్నాలజి(అత్యాధునికమైన శాస్త్రవిజ్ఞానం) ఉపయోగించినప్పటికి భూమిని 20కి.మీటర్లను మించి త్రవ్వలకపోయారు. ఎందుకనగా భూమి నుండి 12,262మీటర్ల లోతులో ఉష్ణోగ్రత $180^0$ సెల్సియస్ ఉంటుంది అంటే అక్కడి ఉష్ణోగ్రతలను తట్టుకోవడం ఎటువంటి లోహానికైనా కష్టం. ఆ వేడికి ఎలాంటి పదార్థమైనా సరే కరిగిపోవాల్సిందే అంతటి ఉష్ణోగ్రతను తట్టుకొనే టెక్నాలజి ఇంకా రాలేదు. భూమి యొక్క మధ్యభాగంలో ఉష్ణోగ్రత $6000^0$ సెల్సియస్ ఉంటుంది ఈ ఉష్ణోగ్రత సూర్యుని ఉపరితలంపై ఉండే ఉష్ణోగ్రత కంటే ఎక్కువ. కాబట్టి ఆ ఉష్ణతీవ్రతను తట్టుకునే టెక్నాలజీ లేదు. ఒక వేళ అంత ఎక్కువ ఉష్ణోగ్రతను తట్టుకున్నప్పటికి భూమి లోపల ఒత్తిడిని తట్టుకోవడం చాలా కష్టం. భూమిని త్రవ్వే కొలది ఉష్ణోగ్రతతో పాటు ఒత్తిడి కూడా పెరుగుతుంది. భూమి యొక్క మధ్యలో, భూమి పైన ఉన్న ఒత్తిడికి 300 మిలియన్ రెట్ల ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. అంత ఒత్తిడిని కాదు కదా కనీసం ఆ ఒత్తిడిలో 5% తట్టుకునే శక్తి కూడా ఇప్పుడున్న టెక్నాలజికి లేదు.

***" భూమి యెన్నటికిని కదలకుండునట్లు ఆయనను దానిని పునాదుల మీద స్థిరపరచెను" కీర్తనలు104:5***

***" బుద్ధి జ్ఞానములు సర్వ సంపదలు ఆయనయందే గుప్తములైయున్నవి " కొలస్సీ 2:3***

నేటి మోడ్రన్ సైన్స్‌కి అంతుచిక్కని ఎన్నో విషయాలకు ఆధారమైన దేవుని జ్ఞానాన్ని తెలుసుకోడానికి ఒక్క క్షణమైన ఆలోచిస్తే దేవుని యొక్క ఔన్నత్యమేమిటో తెలుస్తుంది. అటువంటి దేవున్ని నిర్లక్ష్యపరచక ఆయనను ఆరాధించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంతటి గొప్ప దేవుడు మనకుండగా మనం దేని గురించి చింతించాల్సిన పనిలేదు.

***"ఆయన అదృశ్యలక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు" రోమా 1:20***

# దేవుడు - సిరి

దేవుడు మానవులకి ఆజ్ఞలను ఇచ్చాడా? అవి ఆజ్ఞలు అనేకంటే, మానవుని సుఖవంతమైన జీవితానికి సూచనలు అనవచ్చును. మానవుని సృజించినప్పుడు దేవుడు ఏ ఆజ్ఞను ఇవ్వలేదు. వారికి సూచన చేశాడు. ఆ పండు తింటే మీరు చస్తారు. ఇప్పుడు కూడా ఆయన సూచనలే మనకు ఇస్తున్నాడు. మార్తా! నువ్వు నమ్మిన యెడల దేవుని మహిమను చూతువని... అన్నాడు యేసు. దేవుని మహిమను చూడాలంటే దేవున్ని నమ్మాలి.

అలాగే మనం చనిపోయిన తర్వాత సుఖంగా ఉండటానికి కాదు. ఈ లోకంలో మనం దేవుని యెడల ఆయన ఆజ్ఞలుగా చెప్పబడే వాటి విషయంలోనూ భయంగా బ్రతకటం. కష్టపడి కష్టాలలో బ్రతకటం, చనిపోయిన తర్వాత సుఖంగా ఉండటానికి కాదు. ఈ లోకంలో ఈ రోజు, ఇప్పుడే సర్వసమృద్ధిలో ఆత్మ వర్ధిల్లుచున్న ప్రకారం అన్ని విషయాలలోను అనగా ఆర్థికంగా కూడా వర్ధిల్లాలి. ఇందుకు బైబిలులో సూచనలు మనం మన ధనం వాడవలసిన పరిస్థితి చెప్పబడింది. మనకోసం మనం ఖర్చు చేసే డబ్బు విషయంలో దేవుడు హెచ్చరించటం లేదు కానీ, ఇతరుల కోసం మనం ఎంత ఖర్చు చేస్తున్నామో! దానినిబట్టి మన జీవితానికి ఆశీర్వాదాలు అనుగ్రహిస్తాడు. ఈ రోజు ఎవరికి, అంటే దేవునికి పనికి గాని, బీదల కొరకు గాని పైసా ఇవ్వని వారు, దేవుని పేరు మీద వచ్చే డబ్బుతో జల్సా చేసేవారు కూడా సమృద్ధిలో ఉండటానికి కారణం? దేవుడు న్యాయ తీర్పు తీర్చలేడా? కాదు వారి యొక్క తల్లిదండ్రు పరలోకములో ధనము కూర్చుకొనినందున వారి తదనంతరం వారి పిల్లలు దాని బాపతు వడ్డీ తీసుకుంటున్నారు. తర్వాత అసలు ఖర్చు అవుతుంది. అప్పుడు వెల్లకిలాపడతారు.

దేవుని సేవ రకరకాలుగా ఈ లోకంలో జరుగుతుంది. రకరకాలుగా సేవ చేసేవారు రకరకాల మనుష్యులు వాళ్ళు బ్రతకాలి. ఆ సేవలోనికి రాకముందు నీ స్థితి ఏమిటి? అని అడగవద్దు. సేవకుడు అని పేరు స్థిరపడిన తర్వాత అన్నిటిలో అందరిలో ఎక్కువగా ఉండాలి. మరి ముఖ్యంగా అందరికంటే గొప్ప సేవకుడు కాబట్టి మీ చందాలు, కానుకలు మాకివ్వండి. దేవుడిని బీదవాడిని చేసే దేవుని కార్యకర్తల చివరి స్థితి ఏమిటి? మీ కానుకలను పంపండి అని అడిగేవాడు, ఇంటింటికి తిరిగి ప్రార్థన చేసినా, ఉదయం సాయంకాలం ఇంటి ముందు నిలిచి పెద్దగా అరచినా ఒకటే.

దేవునిలో నడిచేవారు దేవుని సేవ చేసేవాళ్ళు దేవున్ని కూడా అడగనవసరం లేదు. అడుగుడి మీకియ్యబడును అన్నాడు కదా! అని అంటారు సేవకులు. ఆయన అడగమంది ఆత్మను, ఆయనను వెదకమన్నాడు, ఆయన నా నీతికై తట్టమన్నాడు. ఈ లోకసంబంధమైన వాటి విషయం ఇవన్నియు మీకు కావలయునని మీ పరలోకపు తండ్రికి తెలియును అని ప్రభువు చెప్పాడు కదా.

దేవుడు మనకిచ్చేవన్నీ, డబ్బులు కూడా మనకు ఆశీర్వాదాలు తీసుకొని వస్తాయి. మన తెలివితేటలతో అడుక్కొనేవన్నీ మనకు మనఃక్లేశానికే. నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవా యందు నమ్మికయుంచుము (సామెతలు 3:5) కాబట్టి ప్రతీ విషయంలోను దేవునిపై ఆధారపడి జీవిద్దాం. దేవుడిచ్చు ఆశీర్వాదాలు పొందుకుందాం!


### చందాదారులకు
### జన్మదిన ప్రకటనలు ఉచితం

మీ లేదా మీ కుటుంబ సభ్యుల యొక్క 5వ తేదీ తర్వాత తేదీలలోని సందర్భాలను మాత్రమే పంపించాలి. ఫోటో ప్రచురించాలంటే ఫుల్ ఫోటోని **Whatsapp** ద్వారా 9440217726కి లేదా ఈ-మెయిల్ ద్వారా holiness.ierf@gmail.comకి పంపాలి. పోస్ట్‌లో పంపకూడదు.

చిన్నపిల్లల పేజి

# బైబిలు కథలు - దావీదు

పిల్లలూ!ఎలా ఉన్నారు? వేసవి సెలవలను హాయిగా ఎంజాయ్ చేయ్తున్నారా! ఎంజాయ్‌మెంట్‌తో పాటు కొంత సమాయాన్ని, ప్రార్థించుటకు, బైబిల్ చదువుటకు వెచ్చించండి. దేవుని జ్ఞానాన్ని తెలుసుకోండి. మరి ఈ రోజు కథలోకి వెళ్దామా.

సౌలు రాజుగా ఉన్న కాలంలో బేత్లెహేము అనేఊరిలో యూదా గోత్రానికి చెందిన యెష్షయి అనే అతను నివసిస్తూండేవాడు. అతనికి 8మంది కుమారులు. ఆఖరి కుమారుని పేరు దావీదు. దావీదు గొఱ్ఱెలు కాసేవాడు. ఒకసారి ఇశ్రాయేలీయులకు ఫిలిష్తీయులకు యుద్ధము జరుగుచుండగా యెష్షయి కుమారులలో ముగ్గురు సౌలు వెంట యుద్ధానికి వెళ్ళారు. యెష్షయి తన కుమారుల సమాచారం కనుక్కొని రమ్మని దావీదుతో చెప్పినప్పుడు దావీదు తన తండ్రి చెప్పిన మాట ప్రకారం తన అన్నల కొరకు వేయించిన తూమెడు గోధుమలు, పది రొట్టెలు, వారి సహస్రాధిపతి కోసం పది జున్ను గడ్డలు తీసుకొని యుద్ధం జరుగుతున్న ప్రదేశానికి వెళ్తాడు. ఏలా లోయకి ఒక వైపు ఇశ్రాయేలీయులు వారికి ఎదురుగా లోయకు ఇంకొక వైపు ఫిలిష్తీయులు సైన్యములతో దిగి ఉన్నారు. పిలిష్తీయులలో గాతు వాడైన గొల్యాతు ఇశ్రాయేలీయులలో ఎవరైన తనను ఎదిరించ గలరా? ఎవరైన తనను ఓడిస్తే ఫిలిష్తీయులందరూ ఇశ్రాయేలీయులకు దాసులమౌతాము లేకుంటే ఇశ్రాయేలీయులే ఫిలిష్తీయులకు దాసులౌతారు అని చెప్పాడు. అయితే అతని మాటలు విన్న ఇశ్రాయేలీయులు భయపడ్డారు




ఎందుకంటే గొల్యాతు ఆరు మూరల జానెడు ఎత్తు ఉండి, తలకు రాగి శిరస్త్రాణము, యుద్ధ కవచము ధరించి ఉన్నాడు. అతని యుద్ధ కవచము ఐదు వేల తులముల రాగి అంత ఎత్తు. అతను కాళ్ళకు కూడ కవచము ఉంది. అతని యీటె కఱ్ఱ చాలా పెద్దది. నేత వేసే వారి దోనె అంత పెద్దది. ఆ యీటె కొన ఆరు వందల తులముల ఇనుమంత ఎత్తు గలది. గొల్యాతు రాగి బల్లెమును ధరించి ఉన్నాడు. అతని ముందర ఒకడు డాలు మోస్తున్నాడు. గొల్యాతు ఆకారం చూసి అతనితో యుద్ధము చేయుడానికి ఇశ్రాయేలీయులు భయపడ్డారు. అతని మాటలు విని ఇంకా భయపడ్డారు. అప్పుడే దండులోని తన అన్నల దగ్గరకు వచ్చిన దావీదు గొల్యా తు మాటలు విని "జీవము గల దేవుని ప్రజలను తిరస్క రించుటకు ఈ సున్నతి లేని ఫిలిష్తీయుడు ఎంతటి వాడు" గొల్యాతును ఓడిస్తే బహు మానం ఏంటి అని అడగ గా గొల్యాతును ఓడించిన వారికి కావలసినంత ఐశ్వర్య మును ఇచ్చి రాజు కుమార్తెని ఇచ్చి పెండ్లి చేస్తానని రాజైన సౌలు ప్రకటించాడు అని తెలుస్తుంది. దావీదు మాటలు విన్న అతని పెద్దన్న ఏలియాబు దావీదుపై కోప్పడ్డాడు. దావీదు ఇంకొకరి దగ్గరకు వెళ్ళి అదే విధముగా మాటలాడగా దావీదు పలికిన మాటలు రాజైన సౌలు విని దావీదును పిలవగా దావీదు గొల్యాతుతో యుద్ధము చేయుటకు సిద్ధముగా ఉన్నానని చెప్తాడు. అయితే సౌలు నువ్వు చిన్న పిల్లాడివి. గొల్యాతు యుద్ధ విద్యలు నేర్చిన

వాడు, వానితో యుద్ధము చేయుటకు నీ బలము సరిపోదు అని దావీదుతో అన్నాడు. అందుకు దావీదు "నేను గొఱ్ఱెలు కాస్తున్నప్పుడు సింహం, ఎలుగుబంటి మంద మీదకి వచ్చి ఒక గొఱ్ఱెపిల్లను ఎత్తుకొని పోతుండగా నేను వాటిని చంపి గొఱ్ఱెపిల్లను రక్షించాను. సింహం నుండి ఎలుగుబంటి నుండి రక్షించిన దేవుడు ఈ సున్నతి లేని ఫిలిష్తీయుని చేతి నుండి కూడ రక్షించగలడు" కదా అన్నాడు. ఇక చేసేదేమి లేక సౌలు సరే వెళ్ళి గొల్యాతుతో యుద్ధం చేయమన్నాడు. దావీదుకి శిరాస్త్రాణము తొడిగించారు కానీ అతనికి అలవాటు లేని కారణంగా అది తీసివేసి తన కఱ్ఱ పట్టుకొని ఏటిలో నుండి ఐదు రాళ్ళను తీసుకొని తన సంచిలో వేసుకొని వడిసెల చేత పట్టుకొని గొల్యాతు దగ్గరకు వెళ్ళాడు. గొల్యాతు దావీదును చూసి " కఱ్ఱ తీసుకొని నా మీదకి వచ్చుచున్నావే నేనేమైన కుక్కనా? ఈ రోజు నిన్ను చంపి ఆకాశ పక్షులకు వేస్తాను" అన్నాడు. అందుకు దావీదు సైన్యములకు అధిపతియైన యెహోవా ఈ రోజు నిన్ను నా చేతికి అప్పగిస్తాడు. ఇశ్రాయేలీయుల దేవుడు కత్తి చేతనో, ఈటె చేతనో రక్షించువాడు కాదని అందరు తెలుసుకుంటారు అన్నాడు. గొల్యాతు ఎదురుగా రాగా దావీదు సంచిలోని రాయిని తీసుకొని వడిసెలలో పెట్టి గొల్యాతు నుదుటిపై కొట్టగా గొల్యాతు బోర్లపడ్డాడు. అప్పుడు దావీదు పరుగెత్తి గొల్యాతుపై నిలబడి గొల్యాతు ఖడ్గముతోనే అతని తలను తెగవేసెను. గొల్యాతు చనిపోవడంతో ఫిలిష్తీయులు పారి పోయారు. ఇశ్రాయేలీయులు ఫిలిష్తీయుల్ని తరిమి వారి సొమ్మును దోచుకున్నారు. తరువాత ఇశ్రాయేలీయుల స్త్రీలు తంబుర చేత పట్టుకొని సౌలు వేలకొలదియు, దావీదు పది వేలకొలదియు శత్రువులను హతము చేసెను అని పొగిడారు. ఆ తరవాత సౌలు దావీదును సహస్రాధిపతిగా చేసెను. సౌలు చిన్న కుమార్తె అయిన మీకాలును దావీదుకిచ్చి పెండ్లి చేశాడు. సౌలు తరువాత దావీదు ఇశ్రాయేలీయులకు రాజుగా నియమించబడ్డాడు.

దావీదు ఏ స్థితిలో ఉన్న దేవున్ని అనుసరించటం మానలేదు. దేవుని ఆజ్ఞలను పాటించేవాడు. అందుకే దేవుడు దావీదును నా హృదయానుసారుడు అన్నాడు. గొఱ్ఱెల కాపరిగా ఉన్న దావీదును దేవుడు హెచ్చించి ఇశ్రాయేలీ యులకు రాజుగా చేశాడు. దావీదు 40 సం॥లు ఇశ్రాయేలీయుల్ని రాజుగా పరిపాలించాడు. దేవుని బిడ్డలమైన మనం కూడ దేవుని ఆజ్ఞలను పాటిద్దాం. దేవునిచే మంచి సాక్ష్యాన్ని పొందుకుందాం! పరలోకరాజ్య వారసత్వాన్ని పొందుకుందాం!

## పాఠకుల పేజీ

'పరిశుద్ధత' పత్రికలో **'పాఠకుల పేజీ'** అనే శీర్షిక ప్రారంభించుచున్నాము. ఈ పేజీ పూర్తిగా పాఠకులకు కేటాయించబడినది. ఈ పేజీలో మీ కుటుంబ సభ్యుల యొక్క పుట్టినరోజు, పెళ్ళిరోజు వేడుకలకు సంబం ధించి వారికి పత్రికా ముఖంగా శుభాకాంక్షలు తెలియ జేయవచ్చును. మీ కుటుంబంలోని యువతీ యువకుల వివాహ సంబంధ సమాచారం అలాగే సువార్త సభల సమాచారం, పదవీ విరమణ సమాచారం, జ్ఞాపకార్థ కూడికల సమాచారం కూడా పంపవచ్చు. పత్రిక గురించి మీరు వ్రాసే ఉత్తరాలు కూడా ఈ శీర్షికలో ప్రచురించబడతాయి. అయితే ఈ అవకాశం ఉపయో గించదలుచుకునే వారు చందాదారులై ఉండాలి. పత్రికకు కట్టిన చందా మొత్తాన్నిబట్టి వారికి స్థలం కేటాయించబడు తుంది. సంవత్సర చందాదారులకి పేజీలో 1/4, రూ. 500 కట్టిన వారికి 1/2 పేజీ, రూ. 1000 కట్టిన వారికి ఫుల్ పేజీ కేటాయించబడును. రూ. 2000 కట్టిన వారికి టైటిల్ (కలర్) లోపలి పేజీలో 1/2 పేజి. రూ. 5000 కట్టిన వారికి టైటిల్ లోపలి ఫుల్ పేజీ కేటాయించ బడును. ఈ అవకాశం సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే ఉచితంగా ఇవ్వబడు తుంది. ప్రతినెలా 5వ తేదీ తర్వాత తేదీలలోని సంధర్భాలను మాత్రమే పంపించాలి. ఫోటో ప్రచురించాలంటే మీ ఫోటోని **Whatsapp** ద్వారా 9440217726కి లేదా ఈ-మెయిల్ ద్వారా holiness.ierf@gmail.comకి పంపాలి.

ఆధునిక దృక్పథం

క్రొత్త కోణాలు

# 3. తప్పిపోయిన కుమారు'లు'

**యేసు చెప్పిన 68 ఉపమానాల్లో 'తప్పిపోయిన కుమారుడు' అనే 'డు' అంతమైనది చిన్నబిడ్డల మొదలు జనబాహుళ్యానికి సుపరిచితమైనది. ఒకరు తండ్రి యొద్ద తన ఆస్థివాటాను తీసుకొని, తండ్రి దూరమై, దుష్టసాంగత్యాలతో సమస్తం కోల్పోయి, పందులపాట్టు తినాల్సిన గతిపట్టింది, కనుక అల కావద్దు అనే నీతి కథగా మత ప్రమేయం లేకుండ అందరూ చెప్పుకొనేది. అయితే, యిదికేవలం ఒక లౌకిక నీతికథేకాదు. పరలోక తండ్రి (దేవుడు) మారుమనస్సు పొందిన పాపిపై చూపే కనికరాన్ని, క్షమాభిక్షను దానితో పాటు తండ్రియొద్దనే ఉంటూ తప్పిపోయి తిరిగి వచ్చిన తన తోడబుట్టువు యెడల కాఠిన్య చూపుట ద్వారా తప్పిపోయిన పెద్ద కూమారుని కలిపి జంటగా 'తప్పిపోయిన కుమారులు' అనే 'లు అంతపు ఉపమానంగా క్రొత్తకోణాల్లో అధ్యయనం చేద్దాం.**

ఈ ఉపమానాన్ని ఇంగ్లీషులో 'ది ప్రాడిగల్ సన్' అని పిలుస్తారు. ఈ మాట బైబుల్లోని ఆ కథలో లేదు. అతడు చేసిన దుబారా పనుల (15:14,15,30) ను బట్టి 'దుబారా కుమారు' డన్నారు. తెలుగులో మనముపయోగించే 'తప్పిపోయిన' అనే బిరుదు కనీసం బైబుల్లోని మాట (వ.24,32)ను బట్టి ఉంది. ఈ ఉపమానం లూకా సువార్తలో మాత్రమే ఉంది (15:11-32). ఈ 22 వచనాలు ఒకే వ్యాసభాగం (Passage / Paragraph)గా ఉందని గ్రహించాలి. వ 11-24లలో చిన్న కుమారుని సంగతి, 25-32లలో పెద్దకుమారుని సంగతి అవిభాజ్యంగా ఉన్నట్లు గమనించాలి. దీన్ని మన బోధకులు రెండు తునకలు చేసి మొదటి భాగాన్ని మాత్రమే లెస్సగా ప్రసంగిస్తుంటారు. అయితే, యేసు ఈ కథను చెప్పటంలో అతి ముఖ్యంగా రెండవ భాగాన్ని చెప్పినట్లు ఈ కథ చెప్పిన సంధర్భం బయలు పరస్తుంది.

యేసు, ఈ కథ చెప్పటానికి సందర్భం, ప్రేరకం, 15:1,2_ 'ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులును ఆయన బోధ వినుటకు ఆయన దగ్గరకు వచ్చుచుండగా పరిసయ్యులును శాస్త్రులును ఆది చూచి_ ఇతడు పాపులను చేర్చుకొని వారితో భోజనము చేయుచున్నాడని సణగుకొనిరి'. ఆ సణుగునకు ప్రత్యుత్తరంగా యేసు మరి రెండు ఉపమానాలు కూడ చెప్పాడు : తప్పిపోయి దొరికిన గొఱ్ఱె కథ ; పోయి దొరికిన నాణెము కథ (15:3-7 ;8-10). ఆ తరువాత తప్పిపోయిన కుమారుల కథ (15:11-32). ఈ మూడింటిలో కథానాయకులు గొఱ్ఱె, నాణెము, కుమారులనుకొంటామేమో! కాని, సరిగా పరీక్షిస్తే, పోగొట్టుకొనిన మనుష్యుడు (గొఱ్ఱెల కాపరి), పోగొట్టుకొనిన స్త్రీ, కుమారులు దూరమైన ఒక తండ్రి. పోగొట్టుకొనబడినవి సుంకరులకు, పాపులకు, ఆశ్చర్యకరంగా_ పరిసయ్యులు, శాస్త్రులకు సహితం సాదృశ్యాలు కాగా ; పోగొట్టుకొనినవాడు పరలోకపు తండ్రికి సాదృశ్యమై యున్నాడు. ఈ క్రొత్తకోణాల్లో పరిసయ్యుల సరి ఉజ్జీలెవరో చూడండి!

ఈ వ్యాసంలోని ప్రధానాంశమైన 'తప్పిపోయిన కుమారుల' విషయానికొద్దాం. అందు చిన్నవాడు **తిరిగి** చెడిపోతే ;పెద్దవాడు తిరగకయే చెడిపోయాడు ;ఒకడు తప్పిపోయి దొరికితే, మరొకడు దొరికి (ఇంటిపట్టునే యుండి) కూడ తప్పిపోయాడు. ఒకడు చచ్చి బ్రతికితే, మరొకడు బ్రదుకుచూ చచ్చిన వాడయ్యాడు. ఒకడు తండ్రికి దూరమై చేరువకు వస్తే, మరొకడు చేరువలో ఉండి కూడ దూరస్థుడయ్యాడు. కనుక, యేసు ఈ కథను చెప్పింది **'పాపుల'**నబడే పాపులకు, సుంకరులకు ; పరిశుద్ధులమనుకొనే పరిసయ్యులకు శాస్త్రులకు (నేటి క్రైస్తవ నాయకులకు, బోధకులకు, విశ్వాసులకు) ఏ తారతమ్యమూ లేదనే విషయాన్ని కొట్ట వచ్చినట్లు స్వయం విశదం కావాలనే గాని, కేవలం ఒక లౌకిక నైతిక అంశాన్ని మాత్రమే బోధించటానికి కాదు!

ఇందున్న అగమ్యగోచర విషాదవేమంటే— పరిసయ్యులు, శాస్త్రులు, తమ వంశాను క్రమత (అబ్రాహాము సంతాన హోదా)ను బట్టి ; యెరూషలేము దేవాలయ సేవ, అర్చనల (గుడులకు పోవటం)ను బట్టి ; వారు పుట్టుకతోనే పరిశుద్ధులు, పవిత్రులు అన్ని, అలా చేయని, లేక అబ్రాహాము (క్రైస్తవ) కుటుంబాలకు చెందని వారంతా పాపులు, సుంకరులు అని భావించటం. రెండవదిగా, యూదుడు, సదాచారి, రబ్బీ, ధర్మశాస్త్రాది లేఖనాల్లో నిష్ణాణత గలవానిగా బయలు వెడలుతున్న **యేసు** తమలో ఒకడుగా ఉండాల్సిన దానికి బదులు ; తాము చేస్తున్నట్లే పాపుల్ని, సుంకరుల్ని ఆమడంత దూరముంచడానికి బదులు ; వారితో కలసి భోజనం చేయుటమనేది వారు జీర్ణించుకోలేని యధార్థం. మూడవదిగా, యేసుయొక్క, అనగా, క్రొత్తనిబంధనగా ఆయన స్థాపించనున్న క్రొత్తలోకం, క్రొత్త బోధలను మచ్చుకైనా ఊహింకోలేని సనాతనుల తికమకలు. మచ్చుకు, యేసు దృష్టిలో— 'పాపము చేయని వాడు ఒకడును లేడు' (1రాజు. 8:40) అనే పాత నిబంధనా సత్యం ప్రతిఒక్క మానవునికి వర్తిస్తుందని, తాను దివి నుండి భువికి వచ్చింది పాపులను వెదకి రక్షించడానికని,

రమారమి క్రీ॥పూ॥ 1500లో మోషే ధర్మశాస్త్రము వెలువడింది. క్రీస్తు అవతరించిన నాటికి పరిసయ్యుల, యాజకుల చేతుల్లో మెలికలు పడింది. పారంపర్యాచారాలకు, వేషధారణకు, దేవాలయ కేంద్రిత మతానికి కట్టుబడి రసాభాస అయ్యింది. యేసు ధర్మశాస్త్రాన్ని కొట్టివేయ టానికి రాలేదన్నాడు (మత్త. 5:17), కాని, దానికి ఎన్నో క్రొత్తకోణాల్లో భాష్యం చెప్పి నెరవేర్చాడు. క్రీస్తు మార్గం అవతరించి కూడ నేటికి 2000 సం॥లు అయ్యింది. నేటికి ఈ మార్గం మతంగా మారి, పోపుల, బిషప్పుల, పాదిరీల, సువార్తికుల, విశ్వాసుల చేతుల్లో ధర్మశాస్త్రం వలెనే మెలికలు తిరిగిందనుపిస్తుంది. నేడు మరో దశాబ్దం, శతాబ్దం, సహస్రాబ్దం ముంగిట నిలచిన మనం క్రీస్తు బోధల్ని ఆయన చెప్పిన క్రొత్తకోణాల్లో గ్రహించి, అనుసరించి, ఒకక్రొత్త సహస్రాబ్దికి క్రొత్త ఒరవళ్ళు దిద్దాలని ఈ విషయాలు

ఈ రక్షణ ధర్మశాస్త్రంలోని పశుపక్ష్యాది పాపపరిహారార్థ బలుల్లో లేదని, కనుక వాటిని నమ్మి ఆచరించే పరిసయ్యులకు యధాతంగా రక్షణ లేనేలేదని.... బల్లలు తల్లక్రిందులయ్యే పరమార్థం!

అందువలన అక్రమబద్ధ పరిశుద్ధులైన పరిసయ్యులు శాస్త్రులు, క్రమబద్ధ పరిశుద్ధుడైన యేసును అక్రమస్థుడని సణుగుతున్నారు! పచ్చరంగు అద్దాలు పెట్టుకొన్న వారికి అంతా పచ్చగానే ఉంటుంది! ఈ నేపథ్యంలో, యేసు తప్పిపోయిన కుమారుల ఉపమానం చెప్పాడని మొదట గమనించాలి. **ఏదైనా ఉపమానాన్ని దాని చారిత్రాత్మక సందర్భానుసారంగా గ్రహించకపోతే అందలి సంపూర్ణ సత్యం బోధపడదు.**

## తప్పిపోయిన చిన్నకుమారుడు

ఉపమానంలోని తండ్రికి ఇద్దరు కుమారులున్నట్లు దేవుని సృష్టిలో కూడ రెండు రకాల ప్రజలున్నారు. కొందరు తండ్రిని కనిపెట్టుకొని ఉండేవారు; మరికొందరు తండ్రి నుండి స్వయిష్టాను సారంగా తమ స్వాస్థ్యాన్ని తీసికొని విడిపోయేవారు. ఈ రెండవ రకంవారు తండ్రికి దూరం అవటంలో ప్రమాదంలేదు కాని తండ్రితో తెగతెంపులు చేసుకొనటంలోనే ప్రమాదం. అంటే, ఆయన కట్టడలను నిర్లక్షించటం తద్వారా దుర్వ్యసనాలు, దుస్సాంగత్యాలు, దుర్వ్యయాలు.... చివరకు దుడ్డుదుగ్గాణి లేని దౌర్భాగ్యస్థితి.... మరీ చివరకు పందుల పొట్టు తినాల్సిన మానవాధమ (dehumanised) స్థితికి దిగజారటం.

ఏలానైతేనేం అతనికి మారుమనస్సు కలిగింది! అన్ని వేళలా బోధకుల, సువార్తికుల, పెద్దల ద్వారానే కాదు. మానవునిలో అంతర్నివాసి అయిన అంతరాత్మ (పరిశుద్ధాత్మ) ప్రబోధం చేత కూడా మారుమనస్సు కలుగుతుంది. కలిగిందే తడవుగా తండ్రి దిశలో పయనం సాగించాడు.

కథానాయకుడైన తండ్రి అతణ్ణి అల్లంత దూరంలోనే చూచాడు. ఎదురు పరుగెత్తాడు. పాపపు కంపు ఇంకా పోని కొడుకు మెడమీద పడ్డాడు. కొడుకు క్షమాపణ చెప్పకముందే క్షమించాడు (వ.20,21). మరలా అతణ్ణి తన కుమారస్థితికి హెచ్చిస్తూ ప్రశస్థ వస్త్రాలు, ఉంగరము, (ఆది. 41:42,1రాజా. 21:8మొ) తొడిగాడు ; (సాతాను) బానిసత్వం నుండి దేవుని స్వాతంత్ర్యానికి హెచ్చిస్తూ చెప్పులు తొడిగించాడు (యెష. 20:2). విందులు వినోదాలతో ఇల్లంతటినీ ఉత్సవ సంబరాలతో సంతోషించ మొదలుపెట్టాడు.

ఈ కథా భాగానికి ముగింపు, **99 మంది నీతిమంతుల విషయమై కలుగు సంతోషం కంటే, మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు దేవుని దూతల ఎదుట ఎక్కువ సంతోషము కలుగుతుందని—** అంతకుముందే చెప్పిన తప్పిపోయిన గొఱ్ఱె (3-7), పోగొట్టుకొన్న నాణెము(8-10)ల విషయములో చెప్పిన విషయమే తప్పిపోయి తిరిగి రాగా దొరికిన చిన్నకుమారుని విషయంలో చెప్పకయే చెప్పినట్లయింది.

## తప్పిపోయిన పెద్ద కుమారుడు


పెద్ద కుమారుడు ఇంటివద్ద తండ్రితోనే ఉన్నాడు. తండ్రికి పొలంపనుల్లో సహాయం చేస్తున్నాడు. ఈ పనులన్నీ పరిసయ్యులు, యాజకులు చేసే దేవునికి సంబంధించిన పనులే. సువార్త సేవ మనం పొలం పనికి పోలుస్తుంటాము. అతడు ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా ధూంధాంగా ఉంది. ఒక సేవకుణ్ణడిగి తెలుసుకున్నాడు: తిరుగుబోతు తమ్ముడు తిరిగి వచ్చాడనిన్నీ, ఈ హంగామా అంతా అందుకోసమేనని. ఇక అతనికి ఇంట్లో ప్రవేశించటానిక్కూడా మనసు రానంత ఆగ్రహం వచ్చింది. బయటనున్న అతణ్ణి లోనికి రమ్మని తండ్రే పిలిచాడు. అయితే, కోపంతో రెండుతలల పాములా బుసకొట్టాడు. ఒకవైపు తాను తండ్రికి విధేయుడుగా ఉన్నట్లు 'స్వనీతి' బుస కస్సుమనింది. రెండో వైపు, 'ఆస్థిని వేశ్యలతో తినివేసిన' ఈ నీకుమారుని కోసం ఇంతపెద్ద ఆర్భాటమా అని అసూయ ద్వేషాలు విషంకక్కే బుస. తన తోడబుట్టువుని తమ్ముడనటానిక్కూడ నోరురాని ఆ పెద్ద కుమారుడు ఆనాటి పరిసయ్యులకు, ఈనాడు దేవుడు వరమిచ్చినా తాము వరమియ్యని పూజారులైన కొందరు బోధకులకు స్వనీతిపరులైన విశ్వాసులకు స్వనీతిపరులకు సాదృశ్యం. అందుకే ఈ రెండో భాగాన్ని అంతగా వివరించి బోధించుట!

బాహ్యంగా, తండ్రి పనులు చేసినంతమాత్రాన చాలదు. తండ్రి మనస్సును, చిత్తాన్ని కూడ చేయాలి. తండ్రికి లోబడినట్లే ఉన్నాడు. కాని, అంతరంగంలో తండ్రికోరే గుణాలులేవు. పెద్ద కుమారుని తప్పేదో తండ్రి ఎత్తిచూపలేదు. అయితే **'మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే; ఈ నీ తమ్ముడు చనిపోయి తిరిగి బ్రదికెను, తప్పిపోయి దొరకెన'**ని తండ్రి చెప్పాడు (వ 32). ఆ వారింపు మూడో సహస్రాబ్దికి మనకు కనువిప్పు కావాలి!

తన సోదరుని స్వీకరించటానికి గాని, అతనికి తమ తండ్రి ఇచ్చిన గుర్తింపును ఓర్వటానికి గాని అడ్డుపడే అసూయ ద్వేషాలను ప్రదర్శించి పెద్దకుమారుడు మరీ తప్పిపోయాడు. చిన్నకుమారుడు బాహ్యంగా కనిపించే పాపాలు చేసి తప్పిపోయాడు. పెద్దకుమారుడు ఆంతరంగికంగా పాపాలు చేస్తూ తప్పిపోయాడు. తండ్రిక ఆనందకారణం తప్పిపోయినా సరే తిరిగి దొరకటం, మారుమనస్సు దానికొకే ఒక మార్గం. మారుమనస్సు, బాప్తిస్మాలు విశ్వాసుల రక్షణకు మొదటి మెట్లు, కాగా రక్షణానందానికి స్వనీతిని, స్వాతిశయాన్ని, రహస్య పాపాలను సహితం త్యజించి క్రీస్తునందు ఎదగటం, పరలోకానికి, నిత్యజీవానికి నిచ్చెన మెట్లు.

ఎంతపాపినైననూ - యేసు చేర్చుకొనును
అంచు సువార్తను - అంతటం జాటించుడి
హల్లెలూయ, హల్లెలూయ - ఎంత పాపినైననూ
యేసు చేర్చుకొనున - టంచుం బ్రకటించుడి (యోహా. 6:37)

పరిసయ్యులు, నేటి క్రైస్తవులు గుర్తెరగాల్సిన సత్యాన్ని తప్పిపోయిన కుమారుల సాదృశ్యం తెలిపే సత్యం.



వచ్చే మాసం : పదిమంది కన్యకలు

## చందాదారుల వివరాలు

| | | |
|---|---|---|
| శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ | రూ. | 2,000 |
| శ్రీ కెల్లి ఐజక్ సుకుమార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 2000 |
| శ్రీమతి పి. అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా | రూ. | 1,200 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. | 1,000 |
| శ్రీమతి ఆర్. జయమ్మలాబాను, గుంతకల్ | రూ. | 1,000 |
| శ్రీమతి సి.హెచ్.సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా | రూ. | 1000 |
| శ్రీ కె. ఐజక్ ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 1000 |
| పేరు తెలీదు (21-2-18 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. | 1000 |
| శ్రీమతి రాజ్యలక్ష్మి, భోపాల్ | రూ. | 1000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. | 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీ పి. యేసుబాబు లోకేష్, ఎర్రంపల్లి, ప.గో.జిల్లా | రూ. | 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. | 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీ వి. యోహాను, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. | 500 |
| శ్రీమతి కె.లూధియ, గోగులమూడి, గుంటూరుజిల్లా | రూ. | 500 |
| శ్రీ యం. నిర్మల్‌కుమార్, అనంతపురం | రూ. | 500 |
| శ్రీ ఎ. శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ | రూ. | 500 |
| కుమారి యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం | రూ. | 500 |
| శ్రీ ఏ. పరిశుద్ధ రాజు, నరసాపురం | రూ. | 500 |
| పాస్టర్.టి.రమేష్ అబ్రాహాము, పెన్నాడ, ప.గోజిల్లా | రూ. | 500 |
| శ్రీ పి. ఇమ్మానియేలు, విజయవాడ | రూ. | 500 |
| శ్రీమతి గ్రేస్ మంజుల, బెంగళూర్ | రూ. | 500 |
| పేరు తెలీదు (తేది12-10-17) బ్యాంక్ అకౌంట్ | రూ. | 400 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. | 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. | 300 |
| శ్రీ కె. సురేష్, ఉప్పరపల్లె, కడప జిల్లా | రూ. | 300 |
| శ్రీ టి. నాగరాజు, చీమకుర్తి, ప్రకాశంజిల్లా | రూ. | 300 |
| శ్రీ ఐ. అనిల్‌కుమార్, కాకినాడ, తూ.గో.జిల్లా | రూ. | 300 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం | రూ. | 300 |
| శ్రీమతి యం. పుల్లమ్మ, కడప | రూ. | 300 |
| శ్రీ బాలాజీరావు సింథియా, వైజాగ్ | రూ. | 300 |
| కుమారి షెఫేలా, దొనకొండ, ప్రకాశం జిల్లా | రూ. | 300 |
| శ్రీ కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. | 250 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. | 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కీపురం, తూ.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి బి. ప్రేమలత, కడప | రూ. | 200 |
| శ్రీమతి కె. వాణికుమారి, చీరాల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీ డి. సుమన్, రుద్రాంగి, కరీంనగర్‌జిల్లా | రూ. | 200 |
| పాస్టర్ పి. కొర్నేలి, మామిళ్ళపల్లి, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి జి. లీలారాణి, ఒంగోలు, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీ బి. నాగభూషణం, వెంకటగిరి, నెల్లూరుజిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| కుమారి కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | రూ. | 200 |
| శ్రీ కె. దుర్గాప్రసాద్, రాజమండ్రి | రూ. | 200 |
| శ్రీ పి. గిద్యోను, నేరేడ్‌మెట్, హైదరాబాద్ | రూ. | 200 |
| శ్రీ వై. జోసఫ్, భీమవరం, ప.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి టి.నిర్మలశాంసన్, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి కె. ప్రేమారూత్, గుంటూరు | రూ. | 200 |
| శ్రీ కె. జెకర్యా, నర్సీపట్నం, విశాఖపట్నజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి యం. అరుణకుమారి, విశాఖపట్నం | రూ. | 200 |
| శ్రీ కె. యెషయా, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి టి. సుమలత, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి ఎన్. సరోజిని, నెల్లూరు | రూ. | 200 |
| శ్రీమతి జి. రోజమ్మ, చీరాల, ప్రకాశం జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి సి.హెచ్. పుష్పారాణి, కాకినాడ | రూ. | 200 |
| శ్రీ కె. లాజరస్, కొయ్యలగూడెం, ప.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీ యం.శ్రీకర్‌కుమార్, జుజ్జూరు, కృష్ణాజిల్లా | రూ. | 200 |
| శ్రీ ఆర్. శ్రీనివాస్, రావులపాలె, తూ.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. | 200 |
| శ్రీ యం. ఐజక్, దాసన్నపేట, విజయనగరం | రూ. | 200 |
| శ్రీమతి కె. హేమాబాబ్జి, భీమవరం | రూ. | 200 |
| శ్రీమతి జె.డి. సుహాసిని ,రాజమండ్రి,తూ.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ సి.హెచ్.రామక్రిష్ణ, ఏలూరు, ప.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ కె.రవికుమార్, హైదరాబాదు | రూ. | 200 |
| శ్రీ కె.వి.వి.రమణ, గండేపల్లి, తూ.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ యం. అబ్రాహాము, తాడేపల్లి, గుంటూరు | రూ. | 200 |
| పేరు తెలీదు (తేది.7-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 200 |
| పేరు తెలీదు (తేది.15-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 200 |
| శ్రీ టి. మరియబాబు, గొట్టిపాడు, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి బి. కళ్యాణి, బెంగుళూరు | రూ. | 200 |
| పాస్టర్ బి. నెహెమ్యా, చిన్నగంజాం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| యు. మేరి సలోమి, సిరివెళ్ళ, కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీ కె. సందీప్‌తేజ, సూళ్ళూరుపేట, నెల్లూరుజిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. జగదీష్, మధిర, ఖమ్మం జిల్లా | రూ. | 200 |
| శ్రీ యల్. నాగరాజు, నంధ్యాల, కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీ యస్. గోపి, పార్వతిపురం,విజయనగరం జిల్లా | రూ. | 200 |
| శ్రీ యస్. విద్యాసాగర్, ఆత్మకూరు,కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి కె. లలిత భాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా | రూ. | 200 |
| పేరు తెలీదు (7-2-19 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. | 200 |
| శ్రీ ఐ. రాజ్‌కుమార్, గుంటూరు | రూ. | 200 |
| శ్రీమతి.టి. సూర్యకుమారి, మహబూబ్ నగర్ | రూ. | 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. | 150 |
| పాస్టర్ జె. జయరాములు, కాకినాడ | రూ. | 150 |
| పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా | రూ. | 150 |
| శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం | రూ. | 150 |
| శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ | రూ. | 150 |

| | | |
|---|---|---|
| పాస్టర్ వి.ఎ.యన్.ప్రసాద్, జద్దుర్ల | రూ. | 150 |
| పాస్టర్ టి. విజయపాల్, నరసరావుపేట | రూ. | 150 |
| శ్రీమతి బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా | రూ. | 150 |
| పాస్టర్ టి. ఆదాము, శంకవరప్పాడు, ప్రకాశంజిల్లా | రూ. | 150 |
| పాస్టర్ ఎ మత్తయ్య, వినుకొండ, గుంటూరు జిల్లా | రూ. | 150 |
| శ్రీ పి. చిన్నారావు, విజయవాడ, కృష్ణాజిల్లా | రూ. | 150 |
| శ్రీమతి పి. విజయలక్ష్మి, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా | రూ. | 150 |
| శ్రీ టి. సునీల్‌కుమార్, కోవెరపాలెం, నెల్లూరుజిల్లా | రూ. | 150 |
| శ్రీమతి వై. కెజియాసత్యసారధి, హైదరాబాద్ | రూ. | 150 |
| వి. మేరినిర్మల, మెట్రోపాలిటన్ మిషన్, విజయవాడ | రూ. | 150 |
| శ్రీ టి. మధుసూధన్, గుంటూరు | రూ. | 150 |
| పాస్టర్ బి. జెకర్యా, రావిపాడు, ప్రకాశం జిల్లా | రూ. | 100 |

**ఏప్రిల్ నెలలో చందాకట్టిన వారు**

| | | |
|---|---|---|
| పేరు తెలీదు (తేది.19-3-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 500 |
| పేరు తెలీదు (తేది.31-3-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 400 |
| శ్రీమతి.టి. సూర్యకుమారి, మహబూబ్ నగర్ | రూ. | 200 |
| శ్రీ టి. నాగార్జున, హుజురాబాద్, కరీంనగర్‌జిల్లా | రూ. | 200 |

**మనియార్డరు ద్వారా, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వారు తప్పని సరిగా మాకు ఫోన్ చేసి తెలియజేయాలి. లేనిచో వారి పేరు చందాదారుల లిస్టులో ఉండదు. చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము.**

**బైబిల్ క్విజ్ - 46 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :**


1) **శ్రీమతి యల్. చంద్రలీల,** జె.కొటాలపల్లి, కడప జిల్లా
2) **శ్రీ టి. నాగార్జున,** కరీంనగర్
3) **శ్రీ వై. యేసయ్య,** కడప
4) **శ్రీమతి కె. శ్రీదేవి,** ప్రకాశం
5) **శ్రీమతి కత్తి లలితాభాగ్యం,** కనిగిరి, ప్రకాశం జిల్లా
6) **శ్రీమతి కె. సుభద్ర,** విజయవాడ
7) **శ్రీమతి జయమ్మలాబాను,** గుంతకల్లు, అనంతపురంజిల్లా
8) **యం. అనిల్‌కుమార్,** దుమ్ముగూడెం, కొత్తగూడెంజిల్లా

## బైబిల్ క్విజ్ - 46 జవాబులు

**1.**యజన్యా (యెహెజ్కేలు 8:11) **2.**దోషము (9:9) **3.** నాలుగు(10:14) **4.**11:20 **5.**భయభ్రాంతితో (12:19) **6.** స్వబుద్ధి (13:3) **7.**ప్రవక్త (14:11) **8.** 15:7 **9.** ప్రవర్తనను (16:43) **10.**నిబంధనను (17:15) **11.**పాపము (18:20) **12.**బబులోను(19:9) **13.**20:31 **14.**రబ్బా (21:20) **15.**వర్షము (22:25) **16.**వినాశోపద్రవములతో(23:33) **17.**నరహంతకులు(24:9) **18.**అమ్మోనీయులు (25:10) **19.** 26:21 **20.** ఎలీషా (27:7)

## ఈ నెల ప్రశ్న -మే-2019

**ఏది నిమిష మాత్రములోనే కూలి తుత్తినీయులైనది?**
(యిర్మీయా) (రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి)




మీ జవాబు ఈ నెల 20వ తేదీ లోపు మీ పేరు, పత్రిక సీరియల్ నంబరుతో 9440217726 నంబరుకి **SMS** ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.125/-లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 20వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

**ఏప్రిల్ నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు**
జవాబు : భక్తిహీనులు (యెషయా 57:20)

1) శ్రీ. టి. నాగార్జున, కరీంనగర్
2) కుమారి.కె. లక్ష్మీప్రియ, ప్రకాశం
3) శ్రీమతి కత్తి లలితాభాగ్యం, కనిగిరి, ప్రకాశంజిల్లా
4) శ్రీమతి జయమ్మలాబాను, గుంతకల్లు, అనంతపురంజిల్లా

**పొడుపు కథ**

**"అది నాన్న బొమ్మ నీకెందుకమ్మా**
**అత్తవారింట అది ఉండతగదమ్మా"**

(పంపినవారు శ్రీమతి మేరి, ఒంగోలు)

పొడుపు కథను విప్పి మాకు తెలియజేసిన యెడల వచ్చే మాస పత్రికలో మీ పేరు ప్రకటించడం జరుగుతుంది.

**ప్రకటన**

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**



# అక్షరయజ్ఞం

## బైబిల్ క్విజ్ - 47

( యెహెజ్కేలు 28 నుండి 47వరకు)



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. యెహోవా సేవకుడు ఎవరు? (యెహెజ్కేలు 28అ)
2. ఐగుప్తు ఇశ్రాయేలకు ఎటువంటి చేతి కఱ్ఱ ఆయెను? (29అ)
3. ఐగుప్తునకు కోటగానున్నది ఏది? (30అ)
4. ఎవరు లెబానోను దేవదారు వృక్షమైనట్టుండిరి? (31అ)
5. వారి--- వారి యెముకలకు తగిలెను. పూరించండి (32అ)
6. పాడైపోయిన స్థలములలో ఉండువారు దేని చేత కూలుదురు? (33అ)
7. "తప్పిపోయిన దానిని నేను వెదకుదును" రిఫెరెన్స్ ఏమిటి? (34అ)
8. ఏ దేశము యావత్తును పాడైపోవును? (35అ)
9. "నా ఘనమైన నామమును నేను పరిశుద్ధ పరచుదును" రిఫెరెన్స్ ఏమిటి? (36అ)
10. "నేనువారిని స్థిరపరచెదను" రిఫెరెన్స్ ఏమిటి? (37అ)
11. ఇశ్రాయేలు దేశములో---- పుట్టును. పూరించండి (38అ)
12. గోగువారిని ఇశ్రాయేలీయులు ఎన్ని నెలలు పాతిపెట్టుదురు? (39అ)
13. మంటపమునకు నిడివి ఎంత? (40అ)
14. మందిరము యొక్క నిడివి ఎంత? (41అ)
15. గుమ్మము తూర్పు దిశను చుట్టును కొలత ఎంత? (42అ)
16. ఎన్ని దినములు యాజకులు బలిపీఠమునకు ప్రాయశ్చిత్తము చేయవలెను? (43అ)
17. "వారు తమ దోషము భరించుదురు" రిఫరెన్స్ ఏమిటి? (44అ)
18. పస్కా పండుగ ఎన్ని దినములు ఆచరింపవలెను? (45అ)
19. ఆవరణము మూలమూలను ఆవరింపబడిన ఆవరణము వెడల్పు ఎంత? (46అ)
20. హసరేనాను ఏ పట్టణ సరిహద్దు? (47అ)

**గమనిక :-** మీ జవాబులను **SMS/Whatsapp**ద్వారా కూడా పంపవచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో **"బైబిల్ క్విజ్-47"** అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 20వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్టుబాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

**అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారిలో ఒకరికి "నా దూత" (బాప్తిస్మమిచ్చు యోహాను కథ) అను పుస్తకము (వెల రూ. 50/-) లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా పంపబడును**

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం.